అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

శనివారం 24 జూన్ 2023

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసి వారి ఆకాంక్షలను నెరవేర్చాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ కోరారు. ఆ సంఘం జిల్లాముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కాశపాక దయాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి ఆశలతో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, సకలజనులు తెలంగాణ కోసం ఉద్యమించారన్నారు. అర్హులకు ఇండ్లు, రేషన్ కార్డులివ్వాలని, పోడుభూములు సేద్యం చేస్తున్న వారందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి పల్లా శేఖర్‌రెడ్డి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్దే శ్రీనివాస్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి ఎల్లంకి మహేష్, జిల్లా సమితి సభ్యులు లింగస్వామి, మంచాల సైదులు, లక్ష్మమ్మ, యాదగిరి, నర్సింహ, శ్రీనివాస్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో 8 మందికియావజ్జీ కారాగారశిక్ష

-ఒక్కొక్కరికి రూ.4,500 జరిమానా

భువనగిరిరూరల్ : రాజాపేట పీఎస్‌పరిధిలోని హత్య కేసులో 8మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష తో పాటుగా ఒక్కొక్కరికి రూ.4500 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి మారుతి దేవి శుక్రవారం తీర్పునిచ్చినట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. 2020 ఏప్రిల్ 1న రాజాపేట మండలంలోని చల్లూర్‌లో ఉదయం 8.30 గంటలకు నింధితులు ఏ1 చేట్కూరి ఆయిలయ్య, ఏ2 చేట్కూరి నర్సయ్య, ఏ3 చేట్కూరి కుమార్ , ఏ4 చేట్కూరి యాదగిరి, ఏ5 చేట్కూరి స్వామి, ఏ6 చేట్కూరి అరుణ ,ఏ7 చేట్కూరి లక్ష్మి, ఏ8 చేట్కూరి లక్ష్మి చల్లూర్ గ్రామ వ్యక్తి చెరుకూరు ఐలయ్య ఇంటి జాగా పంచాయతీ విషయంలో తీవ్రంగా కొట్టి హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష , ఒక్కొక్కరికి రూ.4500 జరిమానా విధించినట్టుతెలిపారు. కేసునుదర్యాప్తు చేసిన సీఐ నర్సయ్యను, రాజపేట ఎస్‌హెచ్‌ఓ సుధాకర్ రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారి శ్రీనులను డీసీపీ అభినందించారు.

ఏకకాలంలో రుణాలను మాఫీ చేయాలి

- **తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్**



నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

ఏకకాలంలో రైతుల రుణాలను మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఆసంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018లో రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించిందన్నారు. ఈ రుణమాఫీని నాలుగు వార్షిక విడతలలో మాఫీ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. 2014 ఏప్రిల్ 1 నుండి 2018 డిసెంబర్ 11 మధ్య రుణం పొందిన వారికి రూ. 21,557 కోట్లు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. మొదటి విడతగా 25 వేలలోపు రుణం 5.83 లక్షల మంది రైతులకు 1,198 కోట్లు ఇచ్చి ఒకే విడతగా రుణమాఫీ చేయడంతో పాటు మిగిలిన రుణం నాలుగు విడతలలో మాఫీ చేయబోతున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. 50 వేలలోపు రుణానికి ప్రభుత్వం నిధులు జమ చేసిందని,2018-19 నుండి 2023-24 వరకు బడ్జెట్‌లోగానీ, రివైజ్డ్ చేసిన బడ్జెట్లతో సహా రూ.16,261 కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వం చెప్పిన 5వ విడత 2023-24తో ముగిసిపోతుంది. ఇప్పటి వరకు ఉన్న రైతుల రుణమాఫీ బాకీని ఒకే విడతగా ప్రభుత్వం విడుదల చేసి రైతులను రుణ విముక్తులను చేయాలని కోరారు. ప్రస్తుతం బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. వారి రుణాలను తిరగరాసి బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేస్తున్నారని తెలిపారు. రైతులు వారి అంచనా ప్రకారం రూ. 20 వేల కోట్లు అధిక వడ్డీలకు ప్రయివేటు రుణాలు తెచ్చి వ్యవసాయాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మాఫీలో మొత్తం 40. 66 లక్షల మంది రైతులు రూ.21,557 కోట్లు బాకీ ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రభుత్వం గుర్తించిన మేరకు రైతుల రుణమాఫీకి నిధులు విడుదల చేయాలి. అదేవిధంగా వ్యవసాయం కోసం నగలు తాకట్టు పెట్టిన వారికి కూడా లక్ష లోపు మాఫీ చేస్తామని ప్రభుత్వ జీఓలో చెప్పారన్నారు. వారి బాకీని కూడా లెక్కతీశారని తెలిపారు. నగలు కుదువ పెట్టిన వారి బాకీలను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటలుసాగు చేస్తున్నారని రుణాలు మాఫీ చేసి కొత్తరుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కున్‌రెడ్డి నాగిరెడ్డి, సీనియర్ నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం,కందాల ప్రమీల, అశోక్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి,వెంకట్ రెడ్డి, ఊర్మిళ,ఎర్రంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలు...అత్యాధునిక హంగులు

- **త్వరలో ప్రారంభం కానున్న గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల**
- **రూ.4.20 కోట్లతో మూడున్నర ఎకరాల్లో కార్పొరేట్‌ను తలదన్నేలా నిర్మాణం**
- **అదనంగా మరో రూ.5కోట్లు మంజూరు**
- **పాఠశాల భవనాన్ని పరిశీలించిన జగదీశ్‌రెడ్డి**
- **ఫెన్సింగ్ నిర్మాణం, డైనింగ్ హాల్‌లను మార్పు చేయాలంటూ ఆదేశం**



నవతెలంగాణ-చివ్వెంల

సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి వెంట సువిశాల స్థలంలో నిర్మాణం పూర్తి చేసుకుని కార్పొరేట్ బిల్డింగ్‌ను తలపిస్తున్న నిరుపేద గిరిజన విద్యార్థినులకు బోధన అందించనున్న గురుకులం ప్రారంభానికి సిద్ధమైంది. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవతో ఐలాపురం వద్ద మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ. 4.20 కోట్లతో రూపుదిద్దుకున్న గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలకు మరిన్ని నిధులు మంజూరయ్యాయి. త్వరలో మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ప్రారంభించనున్న స్కూల్ భవనాన్ని శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరిశీలించారు. త్వరలో ప్రారంభంకానున్నాయి.స్కూల్ భవనానికి సంబంధించి ఫెన్సింగ్‌లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా డైనింగ్‌హాల్, కిచెన్‌ను మార్పు చేయాలని ఆదేశించారు. హైవే నుండి స్కూల్‌కు వెళ్లే దారి ఆధునీకరించే పనులను వెంటనే ప్రారంభించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. సూర్యాపేట-ఖమ్మం నూతన జాతీయ రహదారి పక్కన ఐలాపురం వద్ద విశాలమైన స్థలంలో నిర్మాణమై ఆకర్షణీయంగా కనిపిస్తున్న మూడంతస్తుల భారీ భవంతి చివ్వెంల మండలానికే ఓ ఐకాన్‌లా కనిపిస్తుంది.అదేదో కార్పొరేట్ కంపెనీలకు చెందిన భవనమో.. వందలాది బ్రాంచీలు కలిగిన విద్యాసంస్థో అనుకుంటే పొరపాటే. కార్పొరేట్‌ను తలదన్నేలా నిర్మాణం పూర్తి చేసుకుని తుది మెరుగులు దిద్దుకుంటున్న ఆ భవనం సర్కారు గిరిజన గురుకుల పాఠశాల.రంగురంగుల ఆ భవనాన్ని చూసి విద్యార్థినులు పట్టలేని సంతోషంతో ఉన్నారు.పురాతన భవనాలు.. ఊడిపోతున్న పైకప్పు పెచ్చులు.. విరిగిన బెంచీలు.. కనిపించని ప్రహరీలు.. మరుగుదొడ్లు లేక ఆడపిల్లల కష్టాలు.. ఇవన్నీ సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సర్వసాధారణంగా కనిపించేవి. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్కారు బడుల్లో పరిస్థితులు మారిపోయాయి. వసతులు మెరుగుపడ్డాయి.మండలానికో అత్యాధునిక భవనాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలతో పాటు ఉద్యోగార్థుల కోసం అవసరమున్న చోట కోచింగ్ సెంటర్లు కూడా ఏర్పాటు చేసింది.విద్యార్థులకు సన్న బియ్యం, వెజ్, నాన్‌వెజ్‌తో పౌష్టికాహారం అందిస్తున్నది.ఇప్పుడు పాఠశాల భవనాలను కార్పొరేట్ కార్యాలయాన్ని తలదన్నేలా అధునాతనంగా నిర్మిస్తున్నది. సకల సౌకర్యాలు కల్పిస్తున్నది.

గిరిజన గురుకులం ప్రత్యేకతలు..

3.5 ఎకరాల్లో రూ.4.20 కోట్ల వ్యయంతో మూడంతస్తుల బిల్డింగ్ నిర్మించారు.ఒక్కో ఫ్లోర్‌కు 7200 చదరపు అడుగుల చొప్పున మొత్తం 28,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 28 తరగతి గదులు నిర్మించారు.640 మంది విద్యార్థినులు సౌకర్యవంతంగా చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. తరగతి గదులతోపాటు సువిశాలమైన క్రీడా స్థలం, సైన్స్ ల్యాబ్, 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, తాగునీటి వసతి, డైనింగ్ హాల్, అధునాతన మరుగుదొడ్లు నిర్మించారు. భవన నిర్మాణం దాదాపు పూర్తి అయ్యింది.సకల సౌకర్యాలతో నిర్మించిన తమ బడిని చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.మంత్రి వెంట వైస్ ఎంపీపీ జూలకంటి జీవనరెడ్డి, ధరావత్ బాబునాయక్, బోడపట్ల శ్రీను, నాగరాజు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

- **ధరలకు అనుగుణంగా వేతన చట్టాన్ని సవరించాలి**
- **శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి**
- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి**

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

వ్యవసాయ కార్మికులకు, కనీస వేతనాలు అమలు చేస్తూ ఉచిత బీమా సౌకర్యం కనిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో బొజ్జ వెంకులు అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 1948 కనీస వేతనాలు చట్ట ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు ఆధారంగా కనీస వేతన చట్టాన్ని సవరించి అమలు చేయాలని, రెండు సంవత్సరాల బదులు ఐదు సంవత్సరాలకు మార్పు చేయటం జరిగిందని, ఇది వ్యవసాయ కార్మికుల నోట్లో మట్టి కొట్టడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. కష్టజీవుల శ్రమను దోచుకోవడానికే ఉపయోగపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి 9ఏండ్లకాలంలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని సవరించి అమలు చేయలేదని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని సవరించి వ్యవసాయ కార్మికులకు రోజు కూలి రూ.600 ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, వాటిని కొని తినలేని పరిస్థితుల్లో వ్యవసాయ కార్మికులు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధాకలితో వ్యవసాయ పేదలు బతుకుతూ ఉంటే వారికి రోజు కూలి వేతనం పెంచాలనే చిత్తశుద్ధి కాని, పేదలని ఆదుకోవాలనే కనీస ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు. వ్యవసాయ రంగంలో యంత్రాలు రావడంతో పని దినాలు తగ్గిపోయాయన్నారు. బీజేపీ మతోన్మాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిలువ నీడలేని పేద ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలపై మహిళలపై పోలీసులు లాఠీచార్జి చేసి గుడిసెలు కూలగొట్టడం, మంచినీళ్ల బావులను పూడ్చివేయటం లాంటి చర్యలకు కారణమైన వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ మాఫియాతో కుమ్మక్కైన ప్రభుత్వ అధికారులతో ప్రజాప్రతినిలపై చర్య తీసుకొని అందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని కోరారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, పిల్లుట్ల సైదులు, రవి నాయక్, జిల్లా నాయకులు కంబాలపల్లి ఆనంద్, గండ మల్ల రాములు, చింతపల్లి లూరుదు మారయ్య, మన్యం బిక్షం, ఉడుగుండ్ల రాములు, బొడ్డు బాలసైదులు తదితరులు పాల్గొన్నారు.



బీసీకి చెందినవారందరికీ రూ.లక్షలోను ఇవ్వాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్**

నవతెలంగాణ-చౌటుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీలకు రూ.లక్షలోను బీసీలందరికీ ఇవ్వాలని , దరఖాస్తు గడువు పెంచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. శుక్రవారం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి.పాషా అధ్యక్షతన నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రూ.లక్ష లోను పేరుతో తీసుకొచ్చిన స్కీం భాగుందని, అదేవిధంగా అత్యధికంగా ఉన్న గీత, చేనేత, ముదిరాజ్, యాదవులకు ఈ స్కీం వర్తించే విధంగా చూడాలన్నారు. తేడాలు లేకుండా స్కీంను అమలు చేసి ప్రతి బీసీకి లోను అందేవిధంగా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనేక మంది నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తున్న పరిస్థితి ఉందని ఈ సందర్భంగా ప్రభుత్వం ఈ లోను తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ స్కీంను కొంతమందికి పరిమితం చేయడం సరికాదన్నారు. లోను దరఖాస్తు గడువు ముగియడంతో అనేకమంది లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత సర్టిఫికెట్ల కోసం మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల ముందు పడిగాపులు గాస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి గడువు తేదీని పొడిగించాలని కోరారు. ఈ సమావేశంలోఆ పార్టీ పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశ్, ఆకుల ధర్మయ్య, గోషికస్వామి, చేకూరి ఈదయ్య, చింతకింది పాండు, బత్తుల దాసు, కమశెట్ట ప్రభాకర్, పర్నె ధర్మారెడ్డి, ఎర్ర ఊషయ్య, బొడ్డుఅంజిరెడ్డి, ఉస్కగుల శ్రీను, రమేశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీల అభివృద్ధి కోసం..
అనేక పథకాలు తెచ్చిన కేసీఆర్

- **రాష్ట్రహోం శాఖ మంత్రి మహమూద్ అలీ**



నవతెలంగాణ- భువనగిరి

గత ప్రభుత్వాలు చేయని విధంగా సీఎం కేసీఆర్ మైనార్టీల అభివృద్ధి కోసం అనేక పథకాలు రూపొందించారని రాష్ట్ర హెూం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బొమ్మాయిపల్లి చౌరస్తా వద్ద నూతన ఈద్గా నిర్మాణానికి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. తెలంగాణలో కబ్జాలకు గురవుతున్న భూములను పరిరక్షించాలని ప్రత్యేక జీవో తీసుకొచ్చి వక్ఫ్‌భూములను రక్షించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు పొలవుతున్న రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2014 తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ సర్వ మతాల అభివృద్ధి శాంతియుత వాతావరణంలో మైనార్టీల అభివృద్ధి కోసం అనేక పథకాలు రూపొందించారని చెప్పారు. భువనగిరి పట్టణంలో కబ్జాకు గురైన భూమిని ముఖ్యమంత్రి,హెూమ్ శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్ల గానే ఈ భూమిపై రెవిన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ భూమిని రక్షించి మైనార్టీలకు కానుకగా ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి మన ముఖ్యమంత్రి కి,హోం మంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మెన్ అమరేందర్ గౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా చైర్మెన్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ చైర్మెన్ ఆంజనేయులు, పసివుల్లా ఖాన్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ అజీమ్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కాపాడాలని వినతి

భువనగిరి భువనగిరిలోని భారత్ టాకీస్ ఎదురుగా ఉన్న వక్ఫ్‌భూములను కాపాడాలని కోరుతూ మైనార్టీ నాయకులు రాష్ట్ర హోం మంత్రి మహమ్మద్ అలీకి వినతి పత్రం అందజేశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు అమ్మాలని చూస్తున్నారని వెంటనే భూమి కబ్జా కాకుండా చూడాలని కోరారు.



దశాబ్ది ఉత్సవాలతో
ప్రజా ధనం దుర్వినియోగం

- **సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క**

నవతెలంగాణ-కేతెపల్లి

దశాబ్ది ఉత్సవాల పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. కేతపల్లిలో శుక్రవారం పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. పాదయాత్రలో తీవ్ర అస్వస్థతకు గురైన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మూడు రోజుల పాటు కేతెపల్లిలో విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గద్దె ఎక్కిన కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ దొరల ప్రభుత్వం నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి కలిగించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం త్వరలో రాబోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్‌రెడ్డి, కేతపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, పీఏసీఎస్ చైర్మెన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా నాయకులు ఎండి. యూసఫ్ జానీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జటంగి వెంకట్, నరసయ్య యాదవ్, గార్లపాటి రవీందర్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నా య ం క ు ల ు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- **ప్రభుత్వ విప్ గొంగిడి సునీత**

నవతెలంగాణ -రాజాపేట

రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పారుపల్లి, బేగంపేట గ్రామాల వాగుకు మంజూరైన హై లెవెల్ బ్రిడ్జి పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడుతూ బేగంపేట, రేణిగుంట గ్రామాల మధ్యలో ఉన్న వాగు పైన రూ.9కోట్లా 30 లక్షలు మంజూరయ్యాయన్నారు. అదే విధంగా పారుపల్లి, రాజాపేట గ్రామాల మధ్య వాగుపైన రూ.12 కోట్లా 60 లక్షలు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏరడ్డ తర్వాత అనేక గ్రామాల్లో వాగులపైన బ్రిడ్జిలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత కేసిఆర్ కే దక్కిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు , కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా అనేక గ్రామాల చెరువులను నింపడంతో అనేక గ్రామాల చెరువులు జల కళతో తొనిగిసలాడుతున్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఈ బ్రిడ్జిలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, ఎంపీపీ గోపగాని బాలమని యాదగిరి గౌడ్, మదర్‌డెయిరీ డైరెక్టర్లు వెంకట్రాంరెడ్డి ,గొల్లపల్లి రాంరెడ్డి ,జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సంధిలా భాస్కర్ గౌడ్, నాగిర్తి రాజిరెడ్డి , కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, మోత్కుపల్లి ప్రవీణ్, ఎడ్ల బాలలక్ష్మి పాండవుల భాను ప్రకాష్ గౌడ్, లక్ష్మారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎడ్ల స్వరూప రామచంద్రారెడ్డి ,ఎంపీటీసీరాపోలు కవితా తిరుపతిరెడ్డి,జిల్లా బిక్షపతి,పల్లె సంతోష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి జస్వంత్ , దామోదర్, మోత్కుపల్లి నవీన్ ,అస్గర్ జానకి రాములు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాచట్టాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-కోదాదరూరల్

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించే వారిని, ఉద్యమాలు చేసే వారిని కేసులు పెట్టి జైళ్లలో పెట్టి చిత్రహింసలు పెడుతున్న ఉపా చట్టాన్ని రద్దు చేయాలని పలువురు అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు అధ్యక్షతన పట్టణంలోని పబ్లిక్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు.ప్రభుత్వ పాలనపై ప్రశ్నించే వారిని, ప్రజాస్వామ్యవాదులను, మేధావులను దేశద్రోహం కేసులు పెట్టే దుర్మార్గమైన ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు.ఉపా చటంపై అరెస్టు చేసిన వారందర్ని వెంటనే భేషరత్‌గా విడుదల చేయాని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నాయకులు ముత్యాలు, చింతకుంట్లలక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు,పారాసీతయ్య, వక్కావంతుల కోటేశ్వరరావు, ప్రసాద్, బంగారునాగమణి, తోట రంగారావు, మేకల శ్రీను, పిల్లుట్ల శ్రీనివాస్, రాయపూడి చిన్ని, ముత్తినేని సైదేశ్వరరావు, , నంబూరి సూర్యం, నర్సింహారావు, రాఘవరెడ్డి, ఉప్పుగండ్లశ్రీను, నాగేందర్‌రెడ్డి, ముత్తవరపురామారావు తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులందరికీ
ఇండ్ల స్థలాలు కేటాయించాలి

నవతెలంగాణ-గరిడేపల్లి

మండలంలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను కేటాయించాలని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ సైదులు, ప్రధాన కార్యదర్శి యల్లావుల వెంకటేశ్ డిమాండ్ చేశారు.శుక్రవారం వారు మండలకేంద్రంలో మాట్లాడారు.మండలంలో చాలామంది ఎంతో కాలం నుంచి జర్నలిజాన్ని వృత్తిగా భావించి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ వృత్తిమీద ఇష్టంతో ఎంతోమంది సామాజిక సేవలో భాగంగా ఎలాంటి వేతనాలు లేకుండా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలో నిరంతరం పనిచేస్తూ ఉన్నారని తెలిపారు. హుజూర్నగర్ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని హుజూర్నగర్ లో ఇటీవల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించిన విధంగానే గరిడేపల్లి మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3లక్షల పథకాన్ని అమలయ్యేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే హుజూర్‌నగర్‌లో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించి అందరికి ఆదర్శంగా నిలవడం ఎంతో అభినందనీయన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ముచ్చర్ల గోపాలకృష్ణ,తాటికొండ లక్ష్మణ్, మేకపోతుల వెంకటేశ్వర్లగౌడ్,నట్టే కోటేశ్వర్‌రావు, కడారి వెంకటేశ్వర్లు,కొలిపాక జగదీశ్, చాగంటి వీరయ్య రావుల వెంకన్న,సరిగంటిసైదులు,సంద్ర శివ, తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
2
శనివారం 24 జూన్ 2023



నేడు మహా ప్రదర్శన

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు కార్మికులతో మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా జేఏసీ చైర్మెన్ సిహెచ్. లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియం నుండి ఎన్జీ కళాశాల వరకు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాలువలను త్వరగా పూర్తి చేయాలి

● మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

పట్టణంలో నిర్మాణంలో ఉన్న కాలువలను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ. రమణాచారి సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 5 లో గల మహిళా ప్రాంగణ ప్రాంతం, వార్డ్ నెంబర్ 25 సూర్యవంశీకాలనీ, వార్డ్ నెంబర్ 32 రాక్ హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వర్షపు నీటి కాల్వల పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల పనులు త్వరగా పూర్తి చేయాల వర్షాలు రాకముందే నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత వార్డు కౌన్సిలర్లు పి .గణేష్, జె.ధనలక్ష్మి శ్రీనివాస్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత కాంట్రాక్టర్, మున్సిపల్ ఇంజనీర్ బీ.రాములు, ఏఈలు, ఇంజనీర్ పి.అశోక్, బి. వెంకన్న, ఎన్. నరసింహరెడ్డి, మున్సిపల్ ఏఈ వీ. దిలీప్, ఎస్. రవీందర్, ప్రవీణ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జి . శ్రీనివాస్, గులాం ముర్తుజా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-దామరచర్ల

గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బీ.దయానంద్ డిమాండ్ చేశారు. దామరచర్లలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం 16 వేల రూపాయలు ఇవ్వాలని , కార్మికుల పై సర్పంచ్, కార్యదర్శుల వేధింపులను ఆపాలని కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలన్నారు. ఈ నెల 24న నల్లగొండలో జరిగే ప్రదర్శనలో గ్రామ పంచాయతీల కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కార్యదర్శి ఆర్కే.కొండల్‌నాయుడు, గ్రామపంచాయతీ మండల అధ్యక్షులు వాడపల్లి శ్రీరాములు, కార్యదర్శి ఏ.సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ

నవతెలంగాణ-పెద్దవూర



పెద్దవూర మండలంలోని 50 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం జిల్లా విద్యాధికారి బిక్షపతి ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్యాబ్లను పాఠశాలలో వివిధ కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయుటకు ఉపయోగించాలన్నారు. దీక్ష ఆప్‌లో ప్రభుత్వం అప్లోడ్ చేసిన డిజిటల్ పాఠాలు, ఆంగ్లంలో రైమ్స్ వినిపించుటకు ఉపయోగించాలిని తెలిపారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి పాఠశాల సమాచారం పంపించుటకు వీలుగా ఈ టాబ్‌లను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దండ వీరారెడ్డి, రూపారెడ్డి, శంకర్ వర్ధన్, ధనలక్ష్మి, రేణుక, సహదేవి, దేవేందర్, శ్రీనివాస్, కుంభ పార్వతి, వెంకట రమణ, అనురాధ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ క్రీడా పండుగ

● ప్రతిష్టాత్మకంగా ఒలంపిక్ డే రన్ నిర్వహణ



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

జిల్లా కేంద్రంలో ప్రపంచ క్రీడా పండుగ ఒలంపిక్ డే రన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ హఫీజ్ ఖాన్, జిల్లా క్రీడల యువజన అధికారి మక్బూల్ అహ్మద్, 1 టౌన్ సిఐ గోపి ముఖ్య అతిథులుగా పాల్గొని ఒలంపిక్ జ్యోతిని వెలిగించి జెండా ఊపి ఒలంపిక్ డే రన్‌ను ప్రారంభించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి కర్తయ్య అధ్యక్షతన ఎన్జీ కాలేజీ నుండి క్లాక్ టవర్ సెంటర్ మీదుగా ఇండోర్ స్టేడి వరకు ఈ రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి బొమ్మపాల గిరిబాబు, ఉపాధ్యక్షులు ఇమామ్ కరీం, యానాల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పుల్లారావు, జాయింట్ సెక్రెటరీ సిహెచ్.పుల్లయ్య ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ వాసుదేవరావు, ఛాయా సోమేశ్వర దేవాలయం చైర్మెన్ గంట్ల అనంతరెడ్డి, ప్రపంచ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి డాక్టర్ గోనారెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి శంభులింగం, రామయ్య డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చింతపల్లి వెంకన్న, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, చంద్రయ్య, శ్రీనివాస్, మోడల్ హైస్కూల్స్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కేతావత్ శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గార్లపాటి శేఖర్, ఫుట్బాల్ కోచ్‌లు మద్ది కర్ణాకర్, కే.దాస్, హాకీ కోచ్ యావర్, టైక్వాండో కోచ్‌లు యాకస్వామి, యునస్ కమల్, వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, శైలజ, ఇద్దయ్య, గుండా శ్రీనివాస్, అలీం, వెంకన్న మరియు ఫుట్బాల్, కబడ్డీ, హాకీ, అథ్లెటిక్, టైక్వాండో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అవగాహనా సదస్సు

నవతెలంగాణ-చండూరు



గట్టుప్పల మండల కేంద్రంలోని కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో చేనేత కార్మికుల కోసం శుక్రవారం అవగాహన సదస్సు చేనేత జౌళి శాఖ నల్లగొండ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు, గట్టుప్పల మండల సాధకుడు ఇడం కైలాసం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపారన్నారు. నేతన్నలకు అర్‌డీ పథకాన్ని, నూలు సబ్సిడీ పథకాన్ని, చేనేత భీమా, చేనేత క్లస్టర్‌లను, ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పథకాలు అందించడంతో సరిపోదని వాటిని ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వ యంత్రాంగంతో పని చేయిస్తుందన్నారు. అందులో భాగంగానే కార్మికులతో ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఈ సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీలు పద్మ, ద్వారక, డీఓ రంజిత్, ఏడీఓ గోపాల్, ధనలక్ష్మి సంఘం అధ్యక్షుడు బావండ్ల ఆంజనేయులు, ధనుంజయ్, మాజీ సర్పంచ్ జగన్నాథం, వార్డ్ సభ్యులు అంజయ్య, నామని బుచ్చయ్య, నరేందర్, శంకరయ్య, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-చండూరు

గట్టుప్పల్ ఎమ్మార్వో ఆఫీస్‌లో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌కుమార్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు బొట్టు శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు, విద్యార్థులుగాని ఆఫీసుకు ఏదైనా పనిమీద పోతే పైసలు ఉంటేనే పనిచేస్తా లేకపోతే చేయను అనే నినాదంతోటి పని చేస్తున్న సురేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఆఫీసుకు కూడా టైంకి రాకుండా రైతులను, విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌ఐ పై విచారణ జరిపి చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై ఆర్‌ఐ సురేష్ కుమార్‌ని వివరణ అడగ్గా విద్యార్థులు, రైతుల నుంచి ఎలాంటి పైసలు తీసుకోలేదని వివరణ ఇచ్చారు. ఆర్‌ఐ చెప్పే దాంట్లో వాస్తవం లేదన్నారు.

చెరుపల్లి భాస్కర్‌కు పితృవియోగం



నవతెలంగాణ-చండూర్

గట్టుప్పల్ ఎంపీటీసీ చెరుపల్లి భాస్కర్‌కు పితృవియోగం జరిగింది. తన తండ్రి శివాలయం మాజీ అధ్యక్షులు చెరుపల్లి లింగయ్య(74) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. పలువురు బీఆర్‌ఎస్ నేతలు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ-అడవిదేవులపల్లి

మండల పరిధిలోని ఉల్సాయపాలెం గ్రామపంచాయతీకి చెందిన సీలోజు సత్తయ్య తన గేదలను తోలుకొని మార్గంలో వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె విద్యుద్ఘాతానికి గురై శుక్రవారం మృతి చెందింది. గేద విలువ సుమారు 40,000 రూపాయలు ఉంటుందని గేద యజమాని సీతయ్య తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

ఉదయ సముద్రం భూ పరిహారం మంజూరు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం లిఫ్టు ఇరిగేషన్ స్కీం కాలువల త్రవ్వకంలో భూమి కోల్పోతున్న 443 మంది రైతులకు భూ పరిహారం రూ.7 కోట్ల 81 లక్షల 96 వేల800 మంజూరు అయిందని తహసీల్దార్ పులి సైదులుగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరిహారం చెక్కులను తహశీల్దార్ కార్యాలయం నుండి అన్ని గ్రామాల రైతులకు శుక్రవారం నుంచి అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు పరిహారం పొందాలని కోరారు.

అంధకారంలో అమ్మనబోలు..

● అమ్మనబోలు సబ్ స్టేషన్ బంద్.. ● నాణ్యత లేని పీపీఆర్ నిర్మాణమే కారణమా? ● నిత్యం పేలుతున్న ఇన్సులేటర్లు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా దేశానికే తలమానికంగా ఉన్న తరుణంలో అంధకారం లేని గ్రామాలు సంపూర్ణ నాణ్యత కలిగిన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం గొప్పగా ఉంది. అయినప్పటికీ నూతన విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణ ఏర్పాటులో కాంట్రాక్టు కక్కుర్తి, అధికారుల అసమర్థత, కాసుల కక్కుర్తితో లోపా భూయిష్టంగా నాణ్యత లోపాలతో పీపీఆర్ ఏర్పాటు, నాణ్యతలేని ఇన్సిలేటర్లు ఏర్పాటు చేయడంతో రెండు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించుకున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆరు నెలలకే మూతపడిన సంఘటన మండల పరిధిలోని అమ్మనబోలు గ్రామంలో చోటుచేసుకుంది.

అంధకారంలో అమ్మనబోలు..

మండల పరిధిలోని అమ్మనబోలు గ్రామం నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో ఆ గ్రామం అంధకారంలో మగ్గుతుంది. ఆ గ్రామంలో ఈదురు గాలులు వీచిన, తేలికపాటి వర్షాలు కురిసిన, విద్యుత్ సరఫరా ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నిలిచిపోతుంది. గ్రామంలో మెడికల్ షాప్ యజమానులు, చిరు వ్యాపారులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు కరెంటు సరఫరా నిలిచిపోతుందో..ఎప్పుడు తిరిగి వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఆ గ్రామస్తులు అధికారులతో, ప్రజాప్రతినిధులతో నిత్యం మొరపెట్టుకోవడం కోస మెరుపు. నాలుగు నెలల వేసవికాలం అష్ట కష్టాలు పడి గడపామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నిత్యం సరఫరా నిలిచిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఎడాది డిసెంబర్ 22 ముందు వరకు గ్రామానికి అక్కనపల్లి గ్రామం నుంచి విద్యుత్ సరఫరా జరిగేది. సబ్ స్టేషన్ నిర్మాణం నాణ్యతలేని పీపీఆర్ ఇన్సులేటర్లతో నిర్మాణం చేపట్టడం వల్ల ఆరు నెలలకే మూత పడింది. దీంతో తిరిగి అక్కనపల్లి గ్రామం నుంచి సరఫరా జరుగుతుంది.

సబ్ స్టేషన్ నిర్మాణం ఇలా..

మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో చివరి పంచాయతీగా ఉన్న అమ్మనబోలు గ్రామం అనాదిగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. నాణ్యతలేని విద్యుత్ సరఫరాతో నిత్యం కష్టాలు ఉన్నాయని, గ్రామానికి విద్యుత్ సరఫరా 12 కిలోమీటర్ల దూరం నుంచి జరుగుతుందని, గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తే అంధకారంలో ఉన్న అమ్మనబోలు విద్యుత్ కాంతులతో కష్టాలు దూరం అవుతాయని ఆ గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ప్రజలు మండలానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు, జిల్లా పరిషత్ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డికి పలుమార్లు విజ్ఞాపనలు అందజేసి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి చొరవతో జిల్లా విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేసి 33 బై 11 కెవి సబ్స్టేషన్ నిర్మాణం చేసేందుకు మార్చి ఆరో తేదీన 2022 సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ తెలంగాణ లిమిటెడ్ వారు పనులు ప్రారంభించి, భైరవునిబండ నుంచి విద్యుత్ లైన్‌అమ్మనబోలు సబ్స్టేషన్‌కు శాలిగౌరారం మండలంలోని భైరవుని బండ సబ్ స్టేషన్ నుంచి కరెంటు సరఫరా చేస్తున్నారు. ఇందుకుగాను సుమారు 100వరకు కరెంటు స్తంభాలను ఏర్పాటు చేశారు. సుమారు 300వరకు ఇన్సులేటర్లను బిగించారు. ఆగమేఘాల మీద తొమ్మిది నెలల కాలంలో పూర్తి చేసి 2022 డిసెంబర్ 12 న విద్యుత్‌శాఖ మంత్రి గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

సబ్‌స్టేషన్ బంద్‌కు నాణ్యత లేని పీపీఆర్ నిర్మాణమే కారణమా?

మండలంలోని అమ్మనబోలులో సబ్ స్టేషన్ ఏర్పాటు మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసి ఆరు నెలల క్రితం ప్రారంభించిన సబేషన్ సేవలు నెల రోజులుగా నిలిచిపోవడం విమర్శలకు తావిస్తోంది. సబ్ స్టేషన్ ఏర్పాటుతో ఏళ్ల తరబడి అనుభవిస్తున్న కరెంటు కష్టాలు ఇక తీరినట్లే అని సంబరపడిన ప్రజలకు కరెంటు కష్టాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. అసలు సబ్ స్టేషన్ నిర్మాణలోపభూయిష్టంగా ఉందంటూ సబస్టేషన్ నిర్మాణంపై బహిరంగంగా గ్రామంలో చర్చించుకోవడం, గ్రామ సభలో ఆందోళన వ్యక్తం చేయడం, సోషల్ మీడియాలో వైరల్ కావడం వచ్చిన ఆరోపణలు వాస్తవమే అన్న చందంగా 25 రోజులుగా మూసివేసిన వైనం వెలుగు చూసింది. కాగా ఇంతకుముందు మాదిరిగానే అక్కెనపల్లి సబ్‌స్టేషన్ నుంచి అమ్మనబోలుకు కరెంటు సరఫరా చేస్తున్నారు. సబ్ స్టేషన్‌కు గుండెకాయ పీపీఆర్. లక్షల రూపాయల విలువ కలిగిన పీపీఆర్ గతంలో చెడిపోయిన పీపీఆర్‌ను మెరుగుపరిచి తిరిగి ఈ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారని, నాణ్యత లేని ఇన్సులేటర్లతో అసలు సమస్య ఏర్పడిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తరుచూ ఏర్పడుతున్న సరఫరా అంతరాయంతో ఏకంగా సబ్సషన్‌ను మూసివేయడం కొసమెరుపు. స్తంభాలకు అమర్చిన ఇన్సులేటర్లు చిన్న గాలి వీచినా...చినుకు రాలినా దీపావళి టపాసులు పేలినట్లు టపటపా పేలిపోతున్నాయి. దీంతో సమస్య ఎక్కడ వచ్చిందో గుర్తించి సరిచేసి కరెంటు సరఫరా పునరుద్ధరించేందుకు పడుతున్న సమయంతో గ్రామస్తులు కరెంటు లేక తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు.

నిత్యం అవస్థలే...

అమ్మనబోలు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం జరిగి ఆరు మాసాలు అడపాదడపా విద్యుత్ సరఫరా చేసి సబ్ స్టేషన్ మూసివేత అనంతరం గతంలో మాదిరిగానే అక్కన పల్లి గ్రామం నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. నిత్యం సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి సరఫరా నిలిచిపోయి శుక్రవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా కాలేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అమ్మనబోలు సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసి సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్యను గుర్తించి పరిష్కరించాలి

గ్రామ సర్పంచ్ బద్దం వరలక్ష్మి రామిరెడ్డి

గ్రామంలో నిత్యం అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ట్రాన్స్‌కో ఏఈఈ, ఏడీ ఈల దృష్టికి తీసుకెళ్లా. సమస్యకు కారణాలు తెలుసుకుని పరిష్కరిస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో చూపడం లేదు. ప్రజాగ్రహానికి గురికాకముందే కరెంట్ సమస్యను పరిష్కరించాలని అధికారులను కొరుతున్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఎంపీటీసీ కొంపెల్లి సైదులు

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన అమ్మనబోలు 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణంలో నాణ్యత లేని పీపీఆర్, ఇన్సులేటర్లను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ పై పర్యవేక్షించని అధికారులపై చర్యలు తీసుకోవాలి. ప్రజల కష్టాలు తీరుతాయని సబ్ స్టేషన్ నిర్మాణంతో ఇబ్బందులు తొలగిపోయాయి అనుకున్న క్రమంలో గతంలో కంటే ఎక్కువ సమస్యలు చోటుచేసుకున్నాయి.

త్వరలోనే పునరుద్ధరిస్తాం



ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్

స్తంభాలకు అమర్చిన ఇన్సులేటర్లు చిన్న గాలి వీచినా... చినుకు రాలినా టపటపా పేలిపోతున్నాయి. దీంతో సమస్య ఎక్కడ వచ్చిందో గుర్తించి సరిచేసి కరెంటు సరఫరా పునరుద్ధరించేందుకు పడుతున్న సమయంతో గ్రామస్తులు కరెంటు లేక తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. గుర్తించడానికే సమయం పడుతుంది. ఈ విషయాన్నిఉన్నతాధికారులకు తెలియజేశాం. 300 ఇన్సులేటర్లను మార్చాల్సి ఉంది. అందుకే సబ్‌స్టేషన్ సేవలు నిలిపి ఇప్పటికే 150 ఇన్సులేటర్లను ఏర్పాటు చేశాం. మరో 150 పూర్తి చేసి త్వరలోనే పునరుద్ధరిస్తాం.

మార్కెట్ నిర్మాణం ఉపసంహరించుకోవాలని రాస్తారోకో

నవతెలంగాణ-దేవరకొండ



దేవరకొండ పట్టణంలోని దొంతినేని వెంకట నర్సమ్మ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్థలంలో వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని ఉపసంహరణ చేసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను దహనం చేశారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్మిస్తున్న వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని ఉపసంహరణ చేసుకోవాలని గతంలో అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. కళాశాల ఆవరణంలో ఇప్పటికే కళాశాల ముందు భాగంలో సులబ్ కాంప్లెక్స్, గ్రంథాలయం నిర్మించి విద్యార్థులకు ఆటలు ఆడుకోవడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నాంని తెలిపారు. కళాశాల ఆవరణంలో మార్కెట్ నిర్మించడం వాళ్ళ విద్యార్థులకు చాలా ఇబ్బంది తోపాటు, క్రీడా స్థలం లేక చాలా ఇబ్బదులు ఎదురుకోవలసి వస్తుందన్నారు. సమికృత మార్కెట్ నిర్మాణాన్ని ఉపసంహరణ చేసుకుని, విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు వంగూరి వెంకటేశ్వర్లు, ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు నేనావత్ కుమార్‌నాయక్, సక్కు నాయక్, కుర్ర రాహుల్, సయ్యద్ ఫయాజ్, మొహమ్మద్ సబన్, నరేష్, దీపావతజ్ శ్రవణ్, కేతావత్ చందు, కార్తీక్, నాని, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తక్షణమే అనాథలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● కలెక్టరేట్ ముందు అనాథల అరిగోస దీక్ష



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అనాథలకు అనేక హామీలు ఇచ్చి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా ఒక్క హామీ కూడా ఇప్పటివరకు నెరవేర్చలేదని, తక్షణమే హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ పిలుపుతో నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ముందు ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో అనాథ పిల్లలతో అనాథల అరిగోస దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో తల్లిదండ్రులు లేని, సంరక్షకులు లేని అత్యంత నిస్సహాయులైన అనాథలను సైతం మోసం చేసింది కేసీఆర్ ప్రభుత్వమని విమర్శించారు. కేసీఆర్ అనాథలకు ఇస్తామన్న హామీలను తక్షణమే వారికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలనీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, వచ్చే ఎన్నికలలో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో ఎంఎస్‌పీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్‌మాదిగ, జిల్లా కో- కన్వీనర్ ఇరిగి శ్రీశైలం మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు ఆడేపు నాగార్జునమాదిగ, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్‌మాదిగ, నాగార్జునసాగర్ ఇన్‌చార్జి మడుపు శ్రీనివాస్‌మాదిగ, మిర్యాలగూడ ఇంచార్జ్ మచ్చ ఏడుకొండల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టీ.రామ్మూర్తి అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ ప్రాజెక్టులో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సీడీపీఓకు వినతి పత్రం అందించి మాట్లాడారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు రకాల పనులు చేస్తున్నారని, దీంతో అంగన్‌వాడీలకు పని భారం పెరిగిందన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ల అద్దెలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ ఉద్యోగాల వేతనం పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, టీఏ, డీఏలు తదితర సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పార్వతి, ప్రమీల, అరుణ, నాగమణి, రజిత, శ్రీదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఆధ్యాపకుల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు తాత్కాలిక పద్ధతిన అతిథి ఆధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీఓ షకీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27లోపు జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో బయోడేటాతో పాటు సంబంధిత జిరాక్స్ పత్రాలను అందజేయాలని తెలిపారు. మెరిట్, డెమో ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

● కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను



నవతెలంగాణ-హాలియా

నేటి సమాజంలో విద్య వ్యాపారంగా మారిపోయిందని, కేజీల లెక్కన విద్యను అమ్ముకుంటున్నారని, ప్రయివేట్ విద్యాసంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సామాన్యులకు విద్య అందని ద్రాక్షగా మారిందని, నాణ్యమైన విద్య పేరిట ప్రయివేట్ పాఠశాలలు విచ్చల విడిగా దందా ప్రారంభించారని తెలిపారు. పేద, మధ్యతరగతి పిల్లల తల్లిదండ్రుల సంపాదన పాఠశాల ఫీజులకు సరిపోవటం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు రంగురంగుల కరపత్రాలతో విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తూ పేద ప్రజలను ఆకట్టుకుంటున్నారని, విద్యతోపాటు, పాఠశాలలో ఫీజులు, బట్టలు, బూట్లు, టై,బెల్టు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్ ల పేరిట అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులతో నిర్వహిస్తూ కార్పొరేట్ స్థాయిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యా వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై మండల విద్యాధికారులు ప్రైవేట్ పాఠశాలలు ఇచ్చే మామూళ్ల మత్తులో చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్య ప్రయివేటీకరుణకు వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీను వెంట చిన్నకొమ్ము జీవన్, నయీమ్ భాష ఉన్నారు.

బండరాయిని తొలగించాలని వినతి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



పట్టణంలోని 11వ వార్డులో గల అర్బన్ క్రీడా ప్రాంగణంలో ఉన్న బండరాయిని తొలగించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణచారిని కోరారు. బండరాయినీ తొలగించాలని కోరుతూ శుక్రవారం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బండరాయిని తొలగించాలని అనేకమార్లు విజ్ఞప్తి చేసిన అలాగే వదిలేశారని తెలిపారు. గత సంవత్సరం వినాయక చవితి సందర్భంలో వినాయక మండపం ఎదురుగా ఉన్నందున దానిని వెంటనే తొలగించాలని కోరినప్పుడు మున్సిపల్ ఆఫీసు నుండి జేసీబీ తీసుకొని వచ్చిన డ్రైవర్ దానితో రాదు ఫోక్లైనర్‌తో తొలగించాలని చెప్పి మళ్ళీ వస్తామని నేటికి రాలేదని, బండరాయిని తొలగించలేదని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణంలో ఉండడంతో పిల్లలు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో రెండు నెలలలో గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో బండరాయిని తొలగించాలని కోరారు.

గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే..

● గిరిజన చైతన్య పాదయాత్రలో జైవీర్‌రెడ్డి



నవతెలంగాణ-త్రిపురారం

గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జైవీర్‌రెడ్డి అన్నారు. గిరిజన చైతన్య పాదయాత్ర డొంకతండా నుండి 9వరోజు శుక్రవారం మొదలయ్యింది. పెద్దవూర త్రిపురారం మండలం డొంకతండా, కాణ్య తండా ,ఇస్లావత్ తండా, రూప్లతండా, సీత్యా తండా మీదుగా పాదయాత్ర కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాల్లో జానారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఎలాంటి అభివృద్ధి ఉందో నేడు అలానే ఉందని బీఆర్‌ఎస్ నాయకులు గిరిజన ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారం చేజిక్కించుకున్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500 కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం అందిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జడ్పీటీసీ భారతి, ఎంపీపీ అనుముల పాండమ్మ, అనుముల వెంకటరెడ్డి, పాలగాని సైదులుగౌడ్, పండు, పీబీ.రవి, డొంకతండా సర్పంచ్ మంగా కిషన్, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగఅవకాశాలు

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు సూర్యాపేట జిల్లా ఉపాధికల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ప్రయివేట్ కంపెనీల ద్వారా మిని జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్బన్ సిటీ డెవలపర్స్ ప్రయివేట్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు 200 ఖాళీలు, మార్కెటింగ్ మేనేజర్ 100 ఉన్నాయని పేర్కొన్నారు.జీతం నెలకు రూ.15 వేల నుండి రూ.18 వేల వరకు ఇన్సెంటివేస్, టీఏ ఇస్తామన్నారు.ఈ పోస్టుకు ఎస్సెస్సీ నుండి ఎంబీఏ వరకు చదివి, 18 నుండి 28 ఏండ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు.అలాగే శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సూర్యాపేట బ్రాంచిలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 10 ఖాళీలు ఉన్నాయన్నారు.ఇందులో జీతం నెలకు రూ.16 వేలు, ఇన్సెంటివేస్, టీఏ ఉంటుందన్నారు.ఎస్సెస్సీ నుండి డిగ్రీ వరకు చదివి, 18 నుండి 32 ఏండ్లలోపు వారు అర్హులన్నారు.ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27 మంగళవారం ఉదయం 11 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్స్, జీరాక్స్ కాపీ, పాస్ ఫొటోతో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, రూమ్ నెం:23, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కార్యాలయం, దురాజ్‌పల్లిలో హాజరుకావాలని పేర్కొన్నారు.ఇతర వివరాలకు ఈకింది ఫోన్ నెంబర్లను అర్బన్ సిటీ డెవలపర్స్ హెచ్‌ఆర్ మేనేజర్ 9573381973, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ హెచ్‌ఆర్ మేనేజర్ 9110549902లను సంప్రదించాలని కోరారు.



సంక్షేమపథకాలలో మాలలకు సముచితస్థానం కల్పించాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో మాలలకు సముచిత స్థానం కల్పిస్తూ మాలల అభివృద్ధికి కృషిచేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మేక వెంకన్న డిమాండ్ చేశారు.శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు.సూర్యాపేట జిల్లాలో మాలలకు చాలా సమస్యలు ఉన్నాయని, సమస్యలపై ప్రభుత్వం దృష్టికి, మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చామన్నారు.ముఖ్యంగా రాష్ట్రంలో కులాలవారీగా నిర్మిస్తున్న సంక్షేమభవనాలలో మాలల ఆత్మగౌరవం నిలబడేవిధంగా సంక్షేమభవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సూర్యాపేటజిల్లాకేంద్రంలో మాలలకోసం సంక్షేమ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చే దళితబంధు పథకంలో మాలలకు సమానఅవకాశం కల్పించాలని కోరారు.మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని సూర్యాపేట జిల్లాలో ఉన్న మాలల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు గాజులరాంబాయమ్మ, పిట్టలభాగ్యమ్మ, చందాదాసు, బొల్లెద్దు వినయ్,కుమార్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తకు మంత్రి ఆర్థికసాయం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని మాచారం గ్రామానికి చెందిన చిత్రం శ్రీకాంత్‌కు 2020లో ఎస్సీ కార్పొరేషన్ నుండి రూ.4 లక్షలు మంజూరుకాగా వాటితో మహారాష్ట్ర నుండి పాడి గేదెలు కొనుగోలు చేయగా వాతావరణం అనుకూలించక గేదేలు మృతి చెందాయి.ఆ విషయాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డికి ఫిబ్రవరి 12న మాచారం గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వచ్చినప్పుడు తెలియచేయగా తప్పకుండా సహాయం చేస్తామని తెలిపారు.అందులో భాగంగా శుక్రవారం చిత్రం శ్రీకాంత్‌కు మొదటివిడతగా రూ.లక్ష అందజేశారు. త్వరలో మరో రూ.లక్ష సహకారంఅందిస్తామని తెలిపారు. కాగా శ్రీకాంత్ బీజేపీ గ్రామ కార్యదర్శిగా కొనసాగుతున్నాడు.పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాసేవ చేసే నాయకుడు దొరకడం అదృష్టమని మంత్రికి రుణపడి ఉన్నానని శ్రీకాంత్ సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం ఆనంతారం గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మామిడి వెంకన్న తల్లి మామిడి సైదమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్ సైదమ్మబొబ్బయ్య, పీఏసీఎస్ చైర్మెన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు దొంగరి యుగంధర్, సర్పంచులు చెన్ను శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రేవతిపరంధాములు పాల్గొన్నారు.



గోవధ జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-తుంగతుర్తి

బక్రీద్ పండుగ సందర్భంగా చట్టవిరుద్ధంగా గోవధ జరగకుండా సంబంధిత శాఖను ఆదేశించి,చిత్తశుద్ధితో, సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు మహేష్ అగర్వాల్ కోరారు.శుక్రవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.బక్రీద్ పండుగకు కనీసం 10 రోజుల ముందుగానే ఈ ఆదేశాలు జారీ చేయాలని కోరారు.గోవధకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.బక్రీద్‌కు కనీసం 10 రోజుల ముందు అన్ని పెద్ద జంతువుల సంతలను మూసివేయమని మార్కెటింగ్ విభాగానికి సూచనలను జారీ చేయాలని కోరారు.ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి పశువుల రవాణాను అరికట్టాలని డిమాండ్ చేవారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత హిందూ మహాసభప్రధాన కార్యదర్శి కమలేష్‌దాస్‌మహారాజ్, తుంగతుర్తి మండల గోశాలబాధ్యులు నవీన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభినవ్ క్రీడాస్ఫూర్తిని పాఠ్యాంశాల్లో చేర్చాలి

నవతెలంగాణ-కోదాడరూరల్



అభినవ్ క్రీడాస్ఫూర్తిని పాఠ్యాంశాల్లో చేర్చాలని పలువురు పట్టణ ప్రముఖులు కోరారు.శుక్రవారం అభినవ్ 33 వ జయంతి సందర్భంగా పట్టణంలోని బాలుర హైస్కూల్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి వారి తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు అరుణలతో కలిసి పూలమాలలేసి నివాళులర్పించారు. అభినవ్ స్ఫూర్తితో కోదాడ నుండి భావి క్రీడాకారులు చెస్ లో రాణించాలన్నారు. కోదాడ ఖ్యాతి ని ఖండాంత రాలకు వ్యాపింపజేసిన అభినవ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో అభినవ తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు, అరుణ చింతకుంట్ల. లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు,పారా సీతయ్య,ముత్తినేని సైదేశ్వరరావు, వంగవీటి రామారావు,రావెళ్ల సీతారామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, , షేక్ నయీమ్, చింతాబాబు, వేనేపల్లి శ్రీనివాసరావు, వంది తిరపయ్య, నామా నరసింహారావు, బాగ్దాద్, పత్తిపాక జనార్దన్, చందర్‌రావు, కాంపాటి శ్రీను, దొంగరి.శ్రీనివాస్, గంధం పాండు,కొమరగిరి రంగారావు ,నిరంజన్ రెడ్డి,తిపిరిశెట్టి రాజు, ఉప్పుగండ్ల శ్రీను, బొల్లు రాంబాబు, బొలిశెట్టి వెంకటేశ్వర్లు, కాంపాటి శ్రీను క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

అనాథలకు ఇచ్చిన హామీని సీం కేసీఆర్ నిలబెట్టుకోవాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్నమాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజన్న మాదిగ డిమాండ్ చేశారు.శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రం కలెక్టరేట్ ఆఫీస్ ముందు అనాథల అరిగోస దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వంలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అనాథలకు స్మార్ట్ కార్డులు,కేజీ నుంచి ఆ పై చదువుల వరకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తామని తీర్మానాలు చేసి నేటి వరకు అనాథల యొక్క స్థితిగతులపై తీసుకున్న నిర్ణయాలను అమలు చేయ లేదన్నారు.ఈ కార్యక్ర మంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ములకలపల్లి రవిమాదిగ, పుట్టల మల్లేష్ మాదిగ, ఏపూరి రాజు మాదిగ, పాల్వాయి బాలయ్యమాదిగ, బొజ్జ వెంకన్న మాదిగ ములకలపల్లి మల్లేష్ మాదిగ, మేడికృష్ణ మాదిగ, తాటిపాముల నవీన్‌మాదిగ, చెరుకుపల్లి సతీష్ మాదిగ, కొండేటి గోపి మాదిగ, చింత వెంకన్న మాదిగ చెరుకుపల్లిఅర్జున్, బొజ్జసుమన్ మాదిగ, మిరియాల చిన్నిమాదిగ,అనాథ పిల్లలు పాల్గొన్నారు.



దేశంలో ఆకలి, దారిద్ర్యాలు లేని రాష్ట్రం తెలంగాణ

- కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష
- మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షులు ఏడుకొండలు

నవతెలంగాణ-సూర్యాపేట

దేశంలో ఆకలి దారిద్ర్యాలు లేని రాష్ట్రం తెలంగాణ అని,ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు.బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు కొండేటి ఏడుకొండలు ఆ పార్టీ రాజీనామా చేసి శుక్రవారం ఏడోవార్డు ఇందిరమ్మ కాలనీ పేస్-2లో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో నేటికీ రెండు పూటలా తిండి తింటున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. దేశంలో ఇంటింటికి 24 గంటల కరెంటు త్రాగునీరు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బిజెపి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికీ చాలా గ్రామాల్లో కరెంటు లైన్ లు కూడా లేవన్నారు. దేశ వ్యాప్తంగా అత్యధికంగా 45 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో సైతం 40 వేల మందికి పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.రాష్ట్రంలో వృద్ధులకు రూ.2 వేలు, వితంతువులకు రూ.3 వేలు, వికలాంగులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తుండగా,ప్రధాని మోడీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇస్తున్న పెన్షన్ రూ.600 అంటూ ఏద్దేవా చేశారు.దేశంలో ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేలు ఉన్నారంటే అది కేవలం బీఆర్ఎస్ వారేనన్నారు. అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి బీజేపీకి



రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన ఏడుకొండలు, మహిళా మోర్చా నాయకులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.గులాబీ కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు.బీఆర్ఎస్‌లో చేరిన వారిలో పాల్వాయి వెంకన్న శైలజ, పాపారావు అశోక్, లక్ష్మయ్య చారి, నిర్మల, శ్రీరాములు, సైదా, మరో 200 మంది బీజేపీ కార్యకర్తలు, మహిళా మోర్చా నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ గోపగాని వెంకటనారాయణగౌడ్,మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాలఅన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ ,ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులుగౌడ్, కౌన్సిలర్లు భరత్‌మహాజన్, బత్తులజాని, రాపర్తి శ్రీనివాస్, జానిబాయి, కడారి సతీష్‌యాదవ్,గంగ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహలక్ష్మీ పథకం వర్తింపజేయాలి



నవతెలంగాణ-నేరేడుచర్ల

అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మీ పథకం అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ పార్టీ కార్యాలయం అరిబండిభవన్‌లో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.నియోజకవర్గానికి కేవలం 3000 ఇండ్లు మాత్రమే ఇస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం 9ఏండ్లకాలంలో నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అయినా ఇవ్వలేదన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మీ మార్గదర్శకాలు ప్రజలకు అందుబాటులో లేవని రాష్ట్ర ప్రజలు అడుగుతుంటే ప్రభుత్వం పదుల సంఖ్యలో ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పడం బాధాకరమన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలిస్తామనడం సరికాదన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో సిమెంటు, స్టీల్, మ్యాన్ పవర్, గృహ వినియోగ పనిముట్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు.ఈ పథకం ద్వారా ఇచ్చే రూ.3 లక్షలు సరిపోవని, రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, సీనియర్ నాయకులు కుంకు తిరుపతయ్య,నీలా రామ్మూర్తి, అనెగంటి మీనయ్య, ఎస్‌కె.ఆఫీజ్, ఎడ్ల సైదులు, కొండపల్లి వరలక్ష్మీ, సీహెచ్.కృష్ణవేణి, సట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించని వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

కోదాడ పట్టణంలోని ఎస్‌టీ(బీ) హాస్టల్ వార్డెన్ రవిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం డీటీడబ్ల్యూఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టీబీ వసతి గృహ వార్డెన్ రవి నెల రోజులకు ఒకసారి కూడా హాస్టల్‌కు రావడం లేదన్నారు. స్థానికంగా విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారన్నారు.మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, మెనూ పాటించాలని అడిగిన విద్యార్థులపై అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు.వసతిగృహ గదులు టాయిలెట్స్‌ను శుభ్రపర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.దీంతో వర్కర్లే వార్డెన్‌గా ప్రవర్తిస్తున్నా రన్నారు.వార్డెన్‌ను ప్రశ్నించిన విద్యార్థులను బలవంతంగా హాస్టల్ నుండి పంపిస్తున్నారని విమర్శించారు.ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌ను సందర్శించి విధులను సక్రమంగా నిర్వర్తించని వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్‌కుమార్ ఉన్నారు.






నవోదయ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 'వాగ్దేవి' విద్యార్థులు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని వాగ్దేవి హై స్కూల్ వారి సక్సెస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు నవోదయ పరీక్ష ఫలితాలు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్ జాలా జ్యోతిబాబు తెలిపారు.తమ కోచింగ్ సెంటర్ విద్యార్థులు నిమ్మనగోటి హరిహరన్, గుండుసాయి, రిసిక్, ఇంజమూరి యువంత్ నవోదయ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు.కొన్నేండ్లుగా నవోదయ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తూ హుజూర్‌నగర్ పట్టణంలో చరిత్ర సృష్టిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు కరస్పాండెంట్ జాలా జ్యోతిబాబు, సక్సెస్ కోచింగ్ సెంటర్ అధినేత ప్రిన్సిపాల్ నిడిగొండ గంగాధర్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించి అభినందించారు.



యువత స్వయంఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలి

- ఎంపీపీ చింతా కవితా రాధారెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

యువత స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఎంపీపీ చింతా కవితా రాధారెడ్డి అన్నారు.శుక్రవారం మండలపరిధిలోని గుడిబండ మెయిన్ రోడ్డు నందు కాపుగల్లు గ్రామానికి చెందిన మీగడ సురేష్ నిర్వహిస్తున్న శ్రీ సాయి టిఫిన్ సెంటర్‌ను, మండలపరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాలతిరిపి రాములు కు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన గాలి మిషన్ దుకాణాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు సురేష్‌నాయుడు, వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, ఉద్దండు, పాముల మస్తాన్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు జిల్లా బోసుబాబు, ప్రధానకార్యదర్శి సోమపంగు అంబేద్కర్, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు మీగడ సురేష్,వంట మాస్టర్ నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

27న ప్రగతి నివేదన సభ

నవతెలంగాణ-తుంగతుర్తి

ఈనెల 27న తిరుమలగిరి మండల కేంద్రంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగే ప్రగతి నివేదన సభకు ప్రజలు,పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీఎంపీపీ,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య కోరారు.శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ప్రగతి నివేదన సభకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, జిల్లా అభివృద్ధి ప్రదాత విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, జిల్లానాయకులు గుండగాని రాములుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మెన్ గోపగాని రమేష్‌గౌడ్,దేవాలయ కమిటీ చైర్మెన్ ముత్యాల వెంకన్న,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పులుసు వెంకటనారాయణ,గునిగంటిసంతోష్, బత్తుల జలంధర్, కటకం సూరయ్య,పూసపల్లి శ్రీనివాస్, గోపగాని వెంకన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: ఈనెల 27న నిర్వహించనున్న ప్రగతినివేదనసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు.తుంగతుర్తి నియోజకవర్గ ప్రగతి నివేదన బహిరంగసభ ఈనెల 26వ తారీఖున జరిగే ప్రగతి నివేదన సభ కొన్ని అనివార్య కారణాలవల్ల వాయిదా వేయడం జరిగిందని, తిరిగి 27 వ తారీకు మంగళవారం సాయంత్రం కేటీఆర్ తిరుమలగిరి మండలానికి రానున్నారని తెలిపారు.ప్రతి ఒక్కరూ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత,పీఏసీఎస్ చైర్మెన్ పాలెపు చంద్రశేఖర్,నాయకులు దూపటి రవీందర్, మహేశ్వరం సందీప్‌నేత, ఎండి షకీల్, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, కుదురుపాక శ్రీలత, చాగంటి అనసూయరాములు, ఫత్తేపురం సరిత పాల్గొన్నారు.

నాగారం: ఈనెల 27న తిరుమలగిరి పట్టణ కేంద్రంలో జరిగే ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు.శుక్రవారం నాగారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.ప్రగతి నివేదనసభకు మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. సభకు వెళ్లేవారు ప్రతి గ్రామం నుండి నాగారం మండలకేంద్రానికి కార్యకర్తలు,అభిమానులు వచ్చి ప్రగతి నివేదన సభకు భారీ ర్యాలీగా వెళ్లాలని సూచించారు.ఈ సమావేశంలో రైతుసమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ యారాల రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు పొదిల రమేష్, కేశగాని అంజయ్య, చిల్లర చంద్రమౌళి,ఈదులకిరణ్, చిప్పలపల్లి సోమయ్య, బోయిని లింగమల్లు, తీగుళ్ల ప్రశాంత్,బిల్లా సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రభాకర్

నవతెలంగాణ-కోదాడరూరల్



టీడీపీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఓరుగంటి ప్రభాకర్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నాయకులు ఓరుగంటి ప్రభాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.పార్టీ నియమ నిబంధన కట్టుబడి నియోజకవర్గంలో బలోపేతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీజాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యజమాని నిర్లక్ష్యంతో మహిళ మృతి

నవతెలంగాణ-చివ్వెంల



యజమాని నిర్లక్ష్యంతో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని వట్టి ఖమ్మంపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పసునూరి జానమ్మ (45)సొంత ఇల్లు లేకపోవడంతో రాజ్యలక్ష్మి ఇంట్లో కొంత కాలంగా కిరాయికి ఉంటుంది.ఇంట్లో విద్యుత్ వైర్లు డ్యామేజ్ ఉండడం తో ఎన్నిసార్లు చెప్పినా ఇంటి యజమాని పట్టించుకోకపోవడంతో గురువారం కురిసిన వర్షానికి ఇంటి రేకులకు షార్ట్ సర్క్యూట్ కావడంతో . శుక్రవారం ఉదయం ఇంట్లో బట్టలు తీసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.మృతురాలి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తాటిచెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-గరిడేపల్లి

మండలపరిధిలోని పొనుగోడు గ్రామంలో కల్లు పారే తాటి చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏలుగూరి గోవిందు మడ్డి అంజిబాబు వడిమాండ్ చేశారు. పొనుగోడు గ్రామంలో శుక్రవారం ఉదయం రైతు బాలు భిక్షం పొలాల గట్టున, కాలువ ఒడ్డున ఉన్న14 తాటిచెట్లను చేతి మిషన్ ద్వారా కోయించాడన్నారు. గీత కార్మికులు పోయి చూసేసరికి తాటి చెట్లు అన్ని కుప్పలుకుప్పలుగా పడిపోయి ఉన్నాయని తెలిపారు.గీతన్న గుండె ఒకేసారి ఆగిపోయినట్లుగా అనిపించిందన్నారు.గీత కార్మికులు గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తూ బతుకుతున్నారని తెలిపారు. రైతు వద్దకు పోయి అడుగుదామనుకునే సరికి అతను ముందే నోటికొచ్చినట్లుగా వివిధ రకాలుగా పదజాలంతో బూతులు తిడుతూ ఆడ మగా అనే తేడా లేకుండా అసభ్య పదజాలంతో దూషించాడని విమర్శించారు.తాటిచెట్లు నరికితే శిక్షపడుతుందని తెలిసి కూడా నరికివేయడం ఏంటని ప్రశ్నించారు.నెలరోజుల కింద ఓ వ్యక్తి తాటిచెట్లు నరకడంతో శిక్షపడిందన్నారు.వెంటనే ఎక్సైజ్ శాఖ వారు తాటిచెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేసి శిక్ష పడేవిధంగా చూడాలని కోరారు.గీత కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మలసైదయ్య, కల్లుగీత కార్మికసంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు మండవ సైదులు ,బొల్లెపల్లి శ్రీనివాస్, కారింగుల కాశయ్య, కారింగులహుస్సేన్,బొమ్మరిపోయినపాపయ్య, పల్లవెంకయ్యానక్క కృష్ణయ్య మంగ పాపయ్య, మంగలచ్చయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు రుణమాఫీ చేయాలని ధర్నా

నవతెలంగాణ-మేళ్ళచెర్వు

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గి బ్రహ్మం,సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.రైతులకు రుణమాఫీ చేయాలని, ధరణి సమస్యలు కూడా పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు.ధరణిలో నెలకొన్న సమస్యలను కూడా పరిష్కరించలేదన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీసభ్యులు వట్టెపుసైదులు, గుండుసైదులు, అశోక్, ఆదినారాయణ, సైదాబి, సైదులు, మోహన్‌రెడ్డి, శంకర్, రాములమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలు కట్టినంత మాత్రాన అక్రమవెంచర్ల అమ్మకాలు ఆగవు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా కేవలం నాలా కన్వర్షన్‌తో అక్రమ వెంచర్లు పెట్టి కొంతమంది ప్లాట్ల అమ్మకాలు జరుపుతున్నారని, వీటిపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మూడో వార్డు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు.ఇటీవల అక్రమ వెంచర్ల వ్యాపారం అమ్మకాల విషయమై మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా కేవలం వెంచర్ల వద్ద ఫ్లెక్సీలు పెట్టి తమ పని అయిపోయిందని చేతులు దులుపుకున్నారన్నారు.మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొంతమంది రెండు రోజుల్లోనే తొలగించగా మరి కొంతమంది అదేవిధంగా ఉంచారని తెలిపారు.సుమారు 30 ఎకరాలలో అక్రమ వెంచర్ల వ్యాపారం జరుగుతుందన్నారు.దీంతో మున్సిపాలిటీకి రావాల్సిన మూడెకరాల భూమి పోవడంతో పాటు అనుమతుల పేరుతో రావాల్సిన ఆదాయానికి గండి పడుతుందన్నారు.అంతేకాకుండా ప్లాట్లను కొనుగోలు చేసిన వారికి తదుపరి ఇండ్ల నిర్మాణ సమయంలో మున్సిపాలిటీ అనుమతుల కోసం అత్యధికంగా టాక్స్‌ల రూపంలో మున్సిపాలిటీకి చెల్లించాల్సి వస్తుందన్నారు.డీటీసీపీ అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయొద్దని సబ్ రిజిస్ట్రార్‌కు, తహసీల్దార్‌కు తెలియజేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుందన్నారు.ఈప్పటికైనా మున్సిపల్ అధికారులు అనుమతులు లేని వెంచర్లను గుర్తించి సర్వే నెంబర్లతో సహా దిన పత్రికలలో పచురించి వీటినికొనుగోలు చేయొద్దని ప్రజలకు తెలియజేయాలన్నారు.



చీదెళ్లలో మంత్రి చిట్ చాట్

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలంలోని చీదెళ్ల గ్రామంలో స్థానిక ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి నివాసంలో శుక్రవారం నిర్వహించిన వీరన్న స్వామి పండుగలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ముఖ్యనాయకులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మంత్రిగా, స్థానిక శాసన సభ్యునిగా చేదెళ్ళ గ్రామంలో చేసిన అభివృద్ధిపనులను చర్చించారు.అనంతరం పార్టీ కార్యకర్త వెంకన్నగౌడ్‌ను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మెన్లు వెన్న సీతారాంరెడ్డి, జానకిరాంరెడ్డి, సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, సర్పంచ్ చెన్ను శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్, గ్రామశాఖ అధ్యక్షడు కీర్తివెంకట్రావు, నాయకులు గుర్రం అమృతారెడ్డి, జూలకంటిరాజశేఖర్‌రెడ్డి,గోపిరెడ్డి, సొంటి శీను, కీర్తి యలమంచయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రిభువనగిరి
4
శనివారం 24 జూన్ 2023



జర్నలిస్టులకు అండగా సీపీఐ(ఎం)

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరాజు

నవతెలంగాణ-ఆలేరు రూరల్

సీపీఐ(ఎం) ఎప్పటికీ జర్నలిస్టుల హక్కుల కార్యకర్తల కోసం తోడుగా నిలబడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో ఇటీవల పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ కు పంపిన జనం టీవీ శంకర్ ను ఇంటి వద్ద పరామర్శించి ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుగా బాధ్యత నిర్వహిస్తూ అనేక అవినీతి అక్రమాలపై వార్తలు రాస్తుంటారని జర్నలిస్టులు ఏదైనా హద్దు దాటినప్పుడు వారిని నియంత్రించేందుకు చట్ట ప్రకారం అనేక పద్ధతులు ఉన్నాయని అలా కాకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ ఇక్బాల్ ,మండల కార్యదర్శి దుపటి వెంకటేష్ రైతు సంఘం నాయకులు ఘనగాని మల్లేష్ పాల్గొన్నారు.

కృష్ణావాటర్ పైపు లీకేజీ పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



ప్రజల తాగాల్సిన నీళ్ళు 15 రోజులుగా నేల పాలు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని టిడిపి మండల శాఖ అధ్యక్షులు ఏర్పుల సుదర్శన్,ప్రజల ఆరోపిస్తున్నారు.మండలంలోని సర్వేలు,మల్లారెడ్డి గూడెం, గుజ్జ తదితర సరఫరాయే కృష్ణ వాటర్ పైప్ లైన్ మండలంలోని కంకనలగుడెం ఆంజనేయులు గుడి మద్యల పగిలి 15 రోజులు అయ్యింది. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఇంతవరకు మరమత్తులు చేయలేదనీ ఆయా గ్రామాల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి నీళ్ళు ర ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ఆలేరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఎన్నికైనట్టు ఆలేరు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేశ్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా రాజపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా ఆలేరు పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ సభ్యులుగా పట్టణానికి చెందిన పాశికంటి శ్రీనివాస్, టిఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కుండే సంపత్, పట్టణ ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటేష్, మిల్లర్స్ అసోసియేషన్ తరపున, మోటకొండూరు మండల ఉపాధ్యక్షులు ఇల్లెందుల మల్లేశం,ఆలేరు మండల మాజీ ఉపాధ్యక్షులు కోరుకుప్పల కిష్టయ్య,గుంటి శ్రీశైలం,భూషని వెంకటేష్, గొట్టిపర్తి బాలరాజు, మరల నాగరాజు, చీరా ఎగిడి అశోక్ ,గుగులోతు ముతిరాం,ఉప్పలంచి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మెన్ యాదగిరిగుట్ట,మార్కెటింగ్ జిల్లా అధికారి,అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ అధికారి,గుండ్లగూడెం సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీఏ సభ్యులు పంతం కృష్ణ, గ్రంథాలయాల డైరెక్టర్ బాలస్వామి,పట్టణ మాజీ ఉపాధ్యక్షులు మొరిగాడీ వెంకటేష్,మాజీ సర్పంచ్ చింతకింద మురళి,చిమ్మ శివమాలు,కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని వినతి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదాద్రిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఆలేరు ఎమ్మెల్యే సునీత మహేందర్‌రెడ్డిని స్థానిక జర్నలిస్టులు హైదరాబాదులోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి యాదాద్రి లో పర్యటించిన సందర్భంగా జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్ల స్థలాల విషయంలో జర్నలిస్టులకు తన సపోర్టు ఎప్పుడు ఉంటుందన్నారు .జిల్లా మంత్రితో సంప్రదించిస్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాయగిరి పాండు ,క్షైరం కొండ నవీన్ ,బూడిది శ్రీహరి ,తండ జహంగీర్ ,గొట్టిపర్తి ఉపేందర్ , కళ్లెం సంపత్ ,గుండ్ల వెంకటేష్ ,గుండ్లపల్లి శ్రీరామ్ ,మహేష్ కీసర్ కిషన్ ,గౌలికర్ భాను ,నరేందర్ ,ఆకుల గిరి ,జైని విజయ్ ,ఇంద్రసేనారెడ్డి ,శేఖర్ ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండల కేంద్రంలో లబ్దిదారు బండి మహేష్ గౌడ్‌కు సీఎంసహాయనిధి చెక్కు రూ.20వేలను బీఆర్ఎస్ మండల మండల పార్టీ అధ్యక్షులు పోలగాని వెంకటేష్ గౌడ్ శుక్రవారం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కుశంగల సత్యనారాయణ ,మండల ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీకాంత్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు కుక్కదువు ఉపేందర్, ఉపసర్పంచ్ జూపల్లి భరత్, నాయకులు బెజ్జంకి పాపిరెడ్డి, బోనం కూర మల్లేష్, బేతాళ పాండు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ విజయం ఖాయం

నవతెలంగాణ-ఆలేరురూరల్

వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ ముచ్చటగా మూడవసారి రాష్ట్రంలో విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట పాపిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కొల్లూరు గ్రామంలో కేసీఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ 100 సీట్లు గెలవడం ఖాయమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గదపాక మహేందర్ ,పాల సెంటర్ చైర్మన్ కోటగిరి వెంకటేష్ ,యూత్ అధ్యక్షుడు గాజుల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారుపల్లి పాల సొసైటీ చైర్మెన్‌గా నర్సింహులు

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని పారుపల్లి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం చైర్మెన్‌గా కాలే నరసింహులును శుక్రవారం పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. డైరెక్టర్లుగా జూకంటి చిన్న వీరయ్య భూపతి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా కాలే బిక్షపతి, మోత్కుపల్లి యాకయ్య ఎన్నికయ్యారు. సంస్థ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారం అందిస్తామని తెలిపారు , నరసింహులును ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ రాపోలు లక్ష్మారెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జూకంటి వీరయ్య, ఉప్పలయ్య, నాగేశమ్మ, భూపతి మహేష్, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు పట్టణ కేంద్రంలోని సిల్క్ నగర్ కాలనీకి చెందిన సీనియర్ పాత్రికేయుడు చింతకింది వెంకటేశ్వర్లు తండ్రి వాసుదేవ్ ఇటీవల మరణించగా శుక్రవారం వైస్ చైర్మెన్ చింతకింది చంద్రకళ పరామర్శించారు. వాసుదేవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కోశాధికారి, గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ఈసీ మెంబర్ డాక్టర్ చింతకింది మురహరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మర్ల నాగరాజు



నవతెలంగాణ-రాజపేట

మండలంలోని బొందుగుల గ్రామానికి చెందిన మర్ల నాగరాజు ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన నియామకం పట్ల బీఆర్ఎస్ మండల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. శాలువాతో పలువురు సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా నియమించిన ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చేతికర్రలు పంపిణీ

నవతెలంగాణ-బొమ్మలరామారం



మండలంలోని హాజీపూర్ గ్రామంలో ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, వృద్ధులకు చేతి కర్రలను సర్పంచ్ తిరుమల కవిత వెంకటేష్ గౌడ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామాలలో ఇలాంటి సేవలు చేయడం సంతోషమని ఆరుట్ల ఫౌండేషన్ కు ప్రత్యక్ష అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలరాజు, ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీలదేవి, మమత, సభ్యులు శ్రీధర్, రాజు, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు

రైతుబంధుకు ఐదేండ్లు

- అన్నదాతల ఖాతాల్లోకి 304.96 కోట్లు
- 26 లక్షల 66 వేల 78 మంది లబ్దిదారులు

నవతెలంగాణ -భువనగిరి



దేశంలో ప్రశంసలు అందుకుంటున్న రైతుబంధు పథకానికి ఐదేండ్లు పూర్తయ్యాయి. చిన్న కారు, సన్న కారు అనే తేడా లేకుండా అన్నదాతల ఖాతాల్లోకి ఎకరానికి పదివేల రూపాయల పంట పెట్టుబడి కింద ఇచ్చే ఈ పథకం ద్వారా జిల్లాలో 394 కోట్ల 49 లక్షల 66,386 నేరుగా జమ కానున్నది. 2 లక్షల 66,678 మంది రైతులు ఈ లబ్ది పొందనున్నారు. 2018 మే 10వ తేదీన కరీంనగర్ జిల్లా శాలపల్లిలో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకయ ప్రారంభించి ఐదేండ్లు పూర్తయ్యాయి నాటి నుండి నేటి వరకు ప్రతి ఫజల్ సీజన్లో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. మొదట ఎకరానికి 4వేల చొప్పున రెండు సీజన్లో ఎకరానికి 8వేల చొప్పున పంపిణీ చేసేవారు ఏడాది తర్వాత దీన్ని ఎకరాకు 10వేల పెంచారు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉంటే అన్ని ఎకరాలకు ప్రతి ఎకరానికి 10 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారు.

చివరి తేదీ జూన్ 18 వరకు

పట్టాదారు పాస్ పుస్తకాలు భూమి జూన్ 18 లోపల నమోదయి ఉంటే రైతు బంధువు ఈ నెల 26న వేయనున్నారు. అప్పటికే వారు ప్రభుత్వ అధికారులకు పట్టాదారు పాస్ పుస్తకం బ్యాంకు ఖాతాలను అందించాల్సి ఉంది. మొదట ఎకరం ఉన్న రైతులకు ఖాతాలో వేసి తర్వాత రెండు ,ఐదు ,పది ఎకరాల చొప్పున ఉన్న రైతు ఖాతాల్లోకి డబ్బులు వేయనున్నారు. రైతు బంధు పథకం అమలు తీరిపై ప్రపంచ వ్యవసాయ నిపుణులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

కొత్త పాసుబుక్కులు పొందిన వారు

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవచ్చు

- కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ-భువనగిరిరూరల్



కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు విత్తనాలు, ఎరువులు ,పురుగు మందులు కొనేందుకు పెట్టుబడి సహాయం కింద ప్రభుత్వం రైతుబంధు పథకం వానాకాలం 20 23 రైతుల బ్యాంక్ అకౌంట్ వివరాలు నమోదు చేయడానికి వ్యవసాయ శాఖ అనుమతి ఇచ్చినదని తెలిపారు. 18 జూన్ 2023 వరకు పాసుబుక్కులు పొందిన రైతులు పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంటు జిరాక్స్ ప్రతులను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారికి రైతు వేదికలలో ఇచ్చి రైతుబంధు సహాయం పొందాలని పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకం పొందిన రైతులు 12,666 ఇంతకు ముందు రైతుబంధు పథకం లబ్ది పొందిన రైతులు 2లక్షలా 54010 మంది బ్యాంక్ అకౌంట్ చేంజ్ కరెక్షన్ చేపించుకోవాలని పేర్కొన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం పొంది బ్యాంక్ అకౌంటు ఐఎఫ్ఎస్సి కోడ్ నెంబర్ ఇవ్వని రైతులు ఇప్పుడు వారి బ్యాంకు అకౌంటు పట్టదా పాస్ పుస్తకం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందించాలని పేర్కొన్నారు.

జాగ్రత్త బిడ్డా సినిమా అద్భుతంగా ఉంది

- మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం
- సినీ దర్శకుడు కృష్ణమోహన్‌ను అభినందించిన మాజీ ఎమ్మెల్యే వేముల
- జాగ్రత్త బిడ్డా సినిమాను వీక్షించిన వేముల

నవతెలంగాణ-రామన్నపేట



నూతన దర్శకుడు బడుగు కృష్ణమోహన్ కథ, స్క్రీన్ ప్లే, యాక్టింగ్ చేయడంతో పాటు దర్శకత్వం వహించిన లిజాగ్రత్త బిడ్డాలి సినిమా చాలా బాగుందని, అందరూ సినిమా చూసి ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం విడుదలైన జాగ్రత్త బిడ్డ సినిమాను దర్శకుడు, కథానాయకుడు అయిన సిరిపురం నివాసి బడుగు కృష్ణ మోహన్, సినిమా బృందం తో కలిసి ఎల్బీనగర్ థియేటర్‌లో సినిమాను వీక్షించారు. అనంతరం దర్శకుడు కృష్ణమోహన్, నిర్మాత శ్రీకాంత్, నటీనటులకు ఆయన శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దర్శకుడైన కృష్ణమోహన్ కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించడంతోపాటు కథానాయకుడి పాత్రలో అదర కొట్టారన్నారు. మిగతా నటులందరూ తమ పాత్రను బాగా పోషించాలని, అభినందనీయమన్నారు. సినిమా నేపథ్య సంగీతం, ఫొటోగ్రఫీ ఎడిటింగ్, మేకింగ్ అన్నీ కూడా చకగా కుదిరాయన్నారు. మన తెలంగాణ భాషలో, మన భాషలో మన నటినటులు సినిమా రంగం లో మరింత గొప్పగా రాణించాలని సూచించారు. జాగ్రత్త బిడ్డా సినిమా చక్కని వసులతో నిర్మాతకు లాభాలు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. సినిమా వీక్షించిన వారిలో సినిమా బృందం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహ, సిరిగిరెడ్డి నరిసిరెడ్డి, రాపోలు రమేష్, పున్న రమణ విశ్వం, మాజీ ఉపసర్పంచ్ పున్నా వెంకటేష్, తమ గ్రామస్తుడు దర్శకత్వం వహించి, నటించిన సినిమాను చూడడానికి సిరిపురం గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి వీక్షించారు.

జూలైఒకటిన గ్రూప్-4 పరీక్ష

- అమల్లో ఒక్క నిమిషం నిబంధన
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

వచ్చే జూలై 1న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ - 4 పరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1న ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఇందు కోసం జిల్లాలో మొత్తం 70 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వప్రయివేటు పాఠశాలలు, కాలేజీలలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భువనగిరి డివిజనులో భువనగిరిలో (35), బీబీనగర్ (1), ఆలేరు (6), యాదగిరిగుట్ట(3), మోత్కూర్(1), రాజాపేట(1), బొమ్మలరామారం(1), రామన్నపేట(2), వలిగొండ (2), చౌటుప్పల్ (15), పోచంపల్లి (3), మండలాలలో మొత్తం 70 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగినదని, ఈపరీక్షకు సుమారుగా 19,800 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగానే హాల్ టికెట్ తో పరీక్షా కేంద్రాల వద్ద ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా హాలుకు అనుమతించబడదని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి ఆభరణంలు, షూ గాని ధరించరాదని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైలు ఫోన్, క్యాలిక్‌లేటర్ తెచ్చుకోవద్దని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు టీఎస్‌పీఎస్‌సీ వెబ్ సైట్ నుండి అడ్మిట్ కార్డును డౌన్ లోడ్ చేసుకొని, అడ్మిట్ కార్డ్ తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తెచ్చుకోవాలని పేర్కొన్నారు.



హెరిటేజ్ పాల సెంటర్లను సందర్శించిన సాంబశివరావు

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలంలోని సాదువెళ్లి హెరిటేజ్ పాల సేకరణ సెంటర్‌ను ధర్మారెడ్డి గూడెం లోని వెంకట్ రెడ్డి డెయిరీ ఫామ్ శుక్రవారం హెరిటేజ్ చైర్మెన్ ఎం. సాంబశివరావు పరిశీలించారు. అనంతరం హెరిటేజ్ సెంటర్లలో పాలు పోస్తూ అభివృద్ధి పథంలో నడుస్తున్నా ప్రోగ్రెసి రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హెరిటేజ్ సంస్థ అందించే రైతు బీమా. పశు బీమాతో సబ్సిడీ తో తామకు చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో హెరిటేజ్ జోనల్ హెడ్ సత్యనారాయణ, తెలంగాణ ప్రాంతీయ అధికారి నర్సింగ్గారావు,ట్రస్ట్ హెడ్ శ్రీనివాస్ రావు ,జనగాం సిసి మేనేజర్ జాలపు మహేందర్ రెడ్డి,సిబ్బంది రాజేష్ ,ప్రశాంత్ ,లక్ష్మణ్ ,భాస్కర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

విద్యుత్ ప్రమాదానికి గురైన మండలంలోని చిల్లాపురం గ్రామానికి చెందిన దుబ్బాక జగన్‌ను పరామర్శించిన డిఎల్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాసరి లవలేష్ రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఈయన వెంట లవ్లేష్ స్నేహితులు, ఫౌండేషన్ సభ్యులు జగన్ కుటుంబ సభ్యులు ఉన్నారు.



26న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట

ధర్నాలను జయప్రదం చేయండి

- తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ కొండమడుగు నర్సింహ పిలుపు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి



భూదాన్‌పోచంపల్లిలో..

ఈనెల 26న ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలతో పాటు నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇల్లు లేని పేదలకు పంపిణీ చేయాలని జిల్లా వ్యాప్తంగా అన్ని తహిసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ఇండ్లు లేని పేదలందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా నేటికీ పేదలు మరింత పేదలుగా ఉన్నత వర్గాలు మాత్రం బడా పెట్టుబడిదారులుగా ముందుకు పోతున్న పరిస్థితి ఉన్నదన్నారు. ఏ పార్టీ అధికారం చేపట్టిన పేదలకు



భువనగిరిలో...

మాత్రం నిలువ నీడ లేదని ఉండడానికి ఇల్లు, కుటుంబ పోషణ కోసం సాగుభూమి, చనిపోతే బొంద పెట్టుకోవడానికి ఆరడుగుల స్థలం లేని దుస్థితి నేటికీ కొనసాగడం దారుణమన్నారు. పేదల కోసం రాష్ట్రంలో, జిల్లాలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎందుకు పంచడం లేదని ప్రశ్నించారు.ఇంటిస్థలం ఉన్నవారికి రూ.3 లక్షల నిర్మాణానికి ఇస్తున్నా ప్రభుత్వం నియోజక వర్గానికి కేవలం 3000 ఇల్లు మాత్రమే ఇస్తానని చెప్పడం సరికాదన్నారు.ఈ సమావేశంలో ఆ వేదిక మండల నాయకులు, రైతు సంఘం జిల్లా నాయకులు పగిళ్ళ పగిళ్ల లింగారెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు, మండల్లనాయకులు ఉప్పునూతల యాదగిరి ,ఎస్ఎఫ్ఐ మండలనాయకులుప్రసాదంరాఘవేంద్ర, పాల్గొన్నారు.

వలిగొండ :రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలందరికీ ప్రభుత్వం వెంటనే గృహలక్ష్మి పథకం కింద ఇండ్లను మంజూరు చేయాలని ఇంటి స్థలం లేని వారికి ఇండ్లస్థలాలు ఇవ్వాలని, నూతన రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలనివ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి,రైతు సంఘం జిల్లా నాయకులు చీర్క శ్రీశైలం రెడ్డి కోరారు. శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాలయం వద్ద జరిగిన ప్రజా సంఘాల పోరాట వేదిక సమావేశంలో వారు మాట్లాడుతూ వలిగొండ మండలానికి 1500 ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు . ఈ సమావేశంలో వ్యకాస మండల కార్యదర్శి కల్యారి రామచందర్, రైతు సంఘం జిల్లా నాయకులు మెరుగు వెంకటేశం, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాధారపు మల్లేశం, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు గర్దాసు నరసింహ, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ధ్యానబోయిన యాదగిరి ,మహిళా సంఘం నాయకులు కలుకూరి లక్ష్మమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి : ఇండ్లు లేని లేని నిరుపేదల కోసం ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ఈనెల 26న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో ప్రజాసంఘాల పోరాట వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడిచిన ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్‌లకు సౌకర్యాలు కల్పించలేదన్నారు. చాలామంది నిరుపేదలు భువనగిరి పట్టణంలో సుమారు 5వేల మందికిపైగా ఉన్నారన్నారు. వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వల్దాసు అంజయ్య, ఆవాజ్ నాయకులు యాకూబ్ ,జానీ, కార్యక్రమంలో పాల్గొన్నారు.

మా సీఎం కేసీఆర్... కాంగ్రెస్‌లో సీఎం ఎవరు..?

- కర్నాటక ఫలితంతో ప్రజలను రెచ్చగొడుతున్న రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ కేసీఆర్‌ను మించి ప్రజలకు ఏం చేస్తారో చెప్పడం లేదు
- 27న తిరుమలగిరిలో కేటీఆర్ బహిరంగ సభ
- బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-మోత్కూరు



రానున్న ఎన్నికల్లోనూ మా సీఎం అభ్యర్థి కేసీఆరేనని, కాంగ్రెస్ లో సీఎం అభ్యర్థి ఎవరని బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మెన్ కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సీఎం అభ్యర్థి ఎవరని ప్రశ్నిస్తున్నారని, ఆ పార్టీ కార్యకర్తల్లోనూ అపనమ్మకం ఏర్పడిందని, మా సీఎం కచ్చితంగా కేసీఆరేనని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కొంత ఉత్సాహంగా ఉన్నట్టు ప్రదర్శన కనబర్చుతుండటంతో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పిచ్చి ప్రేలాపణలతో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని, అయినా కాంగ్రెస్‌ను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. నాలుగేళ్లుగా పెద్ద పెద్ద నాయకులు కొట్లాడలేక అలిసి పోయారని, ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజల ముందు ఐక్యతారాగం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లనిర్మాణానికి రూ.6 లక్షలు ఇస్తామన్నా ప్రజలు కాంగ్రెస్‌ను విస్మరించారని, ఈసారి కూడా అదే నినాదం ఎత్తుకున్నారని, గత తొమ్మిదేళ్లలో అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములైన ప్రజలు ఈ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తోనే కలిసివస్తారన్నారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని, అయినా అధికారంలోకి వస్తామని చెప్పుకుంటున్న బీజేపీ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఆ పార్టీ విధానమేంటో ప్రజలకు చెప్పడం లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ కేసీఆర్ ను మించి ప్రజలకు ఏం చేస్తారో మాత్రం చెప్పడం లేదని విమర్శించారు. వైఎస్ఆర్టీపీ, బీఎస్పీ లాంటి చిన్న పార్టీలు కూడా అధికారంలోకి వస్తామంటున్నాయని, ఆ పార్టీలకు రాష్ట్రంలో ఎక్కడా ఒక్క సీటు కూడా రాదని, బీఎస్పీ బహుజనుల పేరు చెప్పుకుని యూపీలో వెలగబెట్టిందేమీ లేదని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఉపయోగం లేదని, ప్రజలు కూడా వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెలంగాణను వ్యతిరేకించిన చంద్రబాబే తెలంగాణ అభివృద్ధి చెందిందని, తెలంగాణలో ఎకరం అమ్మి ఆంధ్రలో వంద ఎకరాలు కొనవచ్చని చెబుతున్నారని, తెలంగాణ వ్యతిరేకులు కూడా నిజాలను, వాస్తవాన్ని దాచుకోలేక బయటకు చెబుతున్నారని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ అద్భుతంగా బాగు చేశారని, 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపించారని, ఉమ్మడిరాష్ట్రంలో 26 లక్షల ఎకరాల వరి సాగుతో దేశంలో రెండో స్థానంలో ఉండగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో వరి సాగును 56 లక్షల ఎకరాలకు పెంచి పంజాబ్ ను దాటి తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. బీఆర్ఎస్ పార్టీగా ఈ విజయాలన్నింటిని ప్రజలకు చెప్పి అన్ని నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ నాయకత్వంలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా ఈనెల 27న తిరుమలగిరిలో సాయంత్రం 4 గంటలకు తుంగతుర్తి ప్రగతి నివేదన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికలకు కార్యకర్తలను, ప్రజలను సన్నద్ధం చేయడం కోసం ఈ సభ జరుగుతుందని, సభవిజయవంతం కోసం గ్రామగ్రామాన సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి సభకు వస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములైన ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని తుంగతుర్తి ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మోత్కూరు మార్కెట్ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, బీఆర్ఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, ఓయూ జేఏసీ నాయకులు మర్రి అనిల్ కుమార్, కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి, సర్పంచ్ బత్తిని తిరుమలేష్, నాయకులు ఎన్.మత్స్యగిరి, రాజేష్, కూరెళ్ల దాస్ పాల్గొన్నారు.

26వరకు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మోత్కూర్

కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు వానాకాలం రైతుబంధు కోసం ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో కె.స్వప్న కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వానాకాలం 2023-24కుగాను ప్రభుత్వం రైతుబంధు కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిందని, ఈనెల 18 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, తహసీల్దార్ డిజిటల్ సంతకం అయిన రైతులు రైతుబంధు దరఖాస్తు పత్రం, పట్టాదారు పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్ లతో ఏఈవోల వద్ద 26 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం కింద ఈకేవైసీ చేసుకోని రైతులు మోత్కూర్ మండలంలో 304 మంది ఉన్నారని, ముశిపట్ల, పాటిమట్ల గ్రామాల్లో శుక్రవారం మొబైల్ ఫేషియల్ యాప్ ద్వారా రైతులకు ఈకేవైసీ చేయించామని, మిగతా రైతులు కూడా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఆమె వెంట ఏఈవోలు జె. సైదులు, ముప్పిడి అశోక్ కుమార్ ఉన్నారు.



పటేల్ రమేశ్‌రెడ్డి అక్రమ అరెస్టు చేయడం తగదు

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డిని అక్రమంగా హౌజ్ అరెస్టు చేయడం తగదని సూర్యాపేట పీఏసీఎస్ డైరెక్టర్,కాంగ్రెస్ జిల్లా నాయకులు గట్టు శ్రీనివాస్ అన్నారు.టీపీసీసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న తీరుకు వ్యతిరేకంగా చేపట్టే నిరసనకు వెళ్లకుండా సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో పటేల్ రమేశ్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జిల్లాకేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి సూర్యాపేటరూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా అక్కడ కూడా నాయకులు ధర్నా చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలుముల గోపాల్‌రెడ్డి, దొంతిరెడ్డి సైదిరెడ్డి, ధరావత్ రవి, నామ పవీణ్, స్వామి నాయుడు, పారుక్, వల్దాస్ దేవేందర్, చిలుకఆనంద్, లక్ష్మీనారాయణ, ఆవుల రాజేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, దాసరి శ్రీను, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



రైతుకు ఆర్థికసాయం అందించాలని తీర్మానం

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి మండల ఎర్రంపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణ స్వామి మృతిచెందగా ఆయన కుటుంబానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించడానికి విమానం చేసినట్టు బ్యాంకు చైర్మెన్ ఎలిమినేటి మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం పీఏసీఎస్ చందుపట్ల సంఘం కార్యాలయంలో అధ్యక్షులు ఎలిమినేటి మల్లారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా, ధాన్యం కొనుగోలు కేంద్రం ఎర్రంబెల్లి కేంద్రంలో తేదీ 11- 6 -2023 ఆదివారం రోజున ప్యాడి క్లీనింగ్ చేస్తూ కరెంట్ షాక్ కు గురై మృతి చెందిన గడ్డ కృష్ణస్వామి తండ్రి పాపయ్య గ్రామం ఎర్రంబెల్లి వారి కుటుంబానికి ఆసరాగా సంఘం నుండి 5 లక్షల రూపాయలను ఆర్థిక సాయం చేయుటకు సంగం అధ్యక్షుల, సభ్యులందరూ కలిసి తీర్మానం చేశారు.ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు బల్గురి మధుసూదన్ రెడ్డి , సుబ్బురు మహేందర్, పల్లెర్ల స్వామి , తోటకురి శంకరయ్య, చింతల వెంకట్ రెడ్డి , భుర్గు సౌజన్య , పెద్దింటి మల్లా రెడ్డి, సంఘ సిఈఓ దంతురి నర్సింహ లు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భువనగిరి

తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4,5వతరగతిలో ప్రవేశాల కోసం క్రీడల డైరెక్టర్ ఆదేశాల ప్రకారం హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ లలో ప్రవేశాలకు మూడు విడతలుగా నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి కే.ధనుంజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో జరిగే బాల బాలికలకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో పోటీలు జులై1 నుండి 5వ తేదీలోపు అన్ని మండలాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు.ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 6 10 మీటర్ల షటిల్ పరుగు, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 800 మీటర్ల పరుగు ద్వారా ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు.4వ తరగతిలో ప్రవేం కోసం విద్యార్థులు 1,సెప్టెంబర్ 2014 నుండి 31ఆగస్టు 2017 మధ్య జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు.5వ తరగతిలో విద్యార్థులు1 సెప్టెంబర్ 2013 నుండి 31 ఆగస్టు 2014 మధ్య జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జులై 12న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల భువనగిరి లో జిల్లా యువజన క్రీడల అధికారి ద్వారా నిర్వహించబడే పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

'ప్రయివేట్'యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

ఎన్నికలు తలపించేలా ప్రచారం చేసుకుంటూ అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రరావు విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలో ఫీజులు నియంత్రించే చట్టం తీసుకురాకపోవడంతో యాజమాన్యాలు వారి ఇష్టానుసారం వివిధ రకాల పేర్లతో విద్యార్థుల నుండి అత్యధిక వ్యాధులను వసూలుచేస్తున్నాయని ఆరోపించారు. జీవో నెంబర్ 199 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి ప్రచారం, ఫ్లెక్సీలు, కరపత్రాలు ఏర్పాటు చేయకూడదన్నారు.ఈ కార్యక్రమంలో మధు, నందు, గోపి,లోకేష్ ,భాను,సుధాకర్, రాజు, పాల్గొన్నారు.



వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

నవతెలంగాణ-మోత్కూరు

రైతులు మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సర్పంచ్ మరిపెల్లి యాదయ్య అన్నారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శుక్రవారం నార్కట్‌పల్లికి చెందిన మదర్ థెరిస్సా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సుస్థిర వ్యవసాయం, సహకార వ్యవస్థపై అవగాహన నదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వంట మార్పిడి చేయాలని, లాభసాటిగా ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం అధ్యక్షుడు వల్లపు సైదులు, ఉపసర్పంచ్ ఎడ్ల భగవంతు, మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య, రైతుబంధు కోఆర్డినేటర్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, డైరెక్టర్లు యాస మాధవి, నరిగె యాదయ్య, అంతటి వెంకటయ్య, సీఈవోనర్సింహాచారి పాల్గొన్నారు.



ఘనంగా బుర్రప్రమోద్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో బుర్ర ప్రమోద్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు.బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని గర్భిణులకు, బాలింతలకు పండ్లు, బెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు బుర్ర సుధారాణి పుల్లారెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ స్థాపించిన ముఖ్య ఉద్దేశం విద్య ,వైద్యం , ఆరోగ్యం, స్పోర్ట్స్, ఫుడ్, డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అన్ని రంగాలలో స్వచ్ఛందంగా సేవలందించడానికి బీవీఆర్ ఫౌండేషన్ స్థాపించామన్నారు.రాబోయే రోజులలో ఫౌండేషన్ తరపున పెద్ద కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎంపటి పద్మ మధు సూదన్‌రావు,అనంతగిరి ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, ఎంపీపీ చింతా కవితరాధారెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మెన్ సంపేట ఉపేందర్‌గౌడ్, డాక్టర్ బ్రహ్మం, కౌన్సిలర్లు కట్టబోయిన జ్యోతి శ్రీనివాసయాదవ్, గుండెల సూర్యనారాయణ, మైస రమేష్, వార్డు కౌన్సిలర్ చంద్రరావు, బుర్ర గోవిందరెడ్డి, బుర్ర బస్విరెడ్డి, కత్రం వీరారెడ్డి,సర్పంచ్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

యదగిరిగుట్టకు మెడికల్ కళాశాల మంజూరివ్వండి

- మంత్రి హరీశ్‌రావును కోరిన ప్రభుత్వ విప్

నవతెలంగాణ-ఆలేరురూరల్

యాదగిరిగుట్టకు మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో రాష్ట్ర ఆర్థిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. . ఇప్పటికే యాదగిరి గుట్ట కు 100 పడకల ఆస్పత్రి మంజూరు అయిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా మెడికల్ కలశాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్వామి వారి దర్శించుకునేందుకు భక్తుల రద్దీ విపరీతంగా పెరిగి పోయిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారని ప్రభుత్వ విప్ తెలిపారు.





మోత్కుపల్లి జ్యోతి,ప్రవీణ్ దంపతులకు ఘనసన్మానం

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఆమెను శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నా కీర్తి రాజిరెడ్డి, జడ్పీటిసి గోపాల్ గౌడ్, ఎంపీపీ బలమని యాదగిరి గౌడ్, మదర్ డైరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి వెంకట్రాంరెడ్డి, సంధిలా భాస్కర్, రాపోలు లక్ష్మారెడ్డి ఎడ్ల రామచంద్రారెడ్డి , తిరుపతిరెడ్డి,పల్లె సంతోష్ గౌడ్ ఎడ్ల బాలలక్ష్మి పాండవులు భాను ప్రకాష్ గౌడ్, కాలే నరసింహులు, సీతాల వీరయ్య, బాలరాజు, మధుసూదన్ రెడ్డి, బిక్షపతి ,వెంకటయ్య,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనాథల అరిగోస దీక్ష

నవతెలంగాణ-భువనగిరి



2016 యాదగిరిగుట్టలో అనాథ పిల్లల కోసం ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభానికి రాష్ట్రపతిని ప్రథమ ముఖర్జీ ని పిలుస్తానని చెప్పి విస్మరించారని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఏహెచ్పిఎస్, ఎంఆర్పిఎస్, ఎంఎస్ఎఫ్ నేతల ఆధ్వర్యంలో అనాథల అరిగోశ దీక్ష స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎం ఎస్ పి జిల్లా కో ఆర్డినేటర్ నల్ల చంద్ర స్వామి నాయకులు దుబ్బ రామకృష్ణ, మంద శంకర్, ఇటుకల దేవేందర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓపై చర్య తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-దేవరకొండ

రైతులను మోసం చేసిన పీఏసీఎస్ సీఈఓపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆర్డీవో గోపి రామ్‌కు బాధిత రైతులు వినతి పత్రం అందజేశారు. డిండి మండలం టీ.గౌరారంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగు, తూకం లెస్ కింద కొన్ని క్వింటాలకొద్దీ వరి ధాన్యం కొనుగోలులో రైతులను మోసం చేసిన పీఏసీఎస్ సీఈవో వంగాల బాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశారు. ఒక్కొక్క లారీకి 60 నుంచి 70 వేల వరకు సదరు సీఈవో తన సొంత లాభం కొరకు మోసపూరితంగా అధికార బలాన్ని దుర్యోగం వినియోగించుకొని అవకతవకలకు పాల్పడినట్లు వారు ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. సీఈఓపై చట్టరీత్య చర్యలు తీసుకుని తమకు జరిగిన నష్టపరిహారాన్ని ఇప్పించాలని కోరారు. ఆర్డీఓ గోపిరామ్ రైతులు ఇచ్చిన వినతి పత్రం ఆధారంగా సీఈఓపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

పీఏసీఎస్ సీఈఓను సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్

డిండి మండలం టీగౌరారం పిఏసిఎస్ సీఈవో బాల్‌రెడ్డి అవకతవకలకు పాల్పడినందున వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. రైతులకు జరిగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. టీ.గౌరారం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంపై విచారణ జరిపి రైతులకు జరిగిన నష్టాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.



బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్

నవతెలంగాణ-మునుగోడు

మండలంలోని సింగారం గ్రామ పరిధిలోని నేరటోనిగూడెంకు చెందిన నేరటి మల్లేష్‌యాదవ్‌ను బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడుగా నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గండి చెర్వు వెంకన్నగౌడ్ నల్లగొండ జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో శుక్రవారం నియాకామ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేరేడు మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాతో పాటు మండల పట్టణ కేంద్రాలలో బీసీ యువజన సంఘాన్ని విస్తరింపజేసి బీసీ యువకులకు హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వేదాంతం గోపినాథ్, సింగారం సర్పంచ్ గుర్రాల పరమేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మాదగోని నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్త రమేశ్‌కు పరామర్శ

నవతెలంగాణ-చందంపేట

చందంపేట మండలంలోని పోలేపల్లి, బండామీదితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సభావత్ రమేష్‌నాయక్ హైదరాబాద్‌లోని ప్రయివేట్ హాస్పిటల్‌లో వెన్నెముక ఆపరేషన్ చేయించుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సభావత్ రమేష్‌ను తన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట చందంపేట జెడ్పీటీసీ నేనావత్ బుజ్జి-లచ్చిరాంనాయక్, యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మానవత్ తండా సర్పంచ్ లోకేష్‌నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యనాయక్, ధర్మ నాయక్, బిల్డింగ్ తండా ఉపసర్పంచ్ రవినాయక్, రామావత్ నాగరాజు రవీందర్‌నాయక్, యువజన కాంగ్రెస్ మండల నాయకులు సాయి రాథోడ్, నాగరాజునాయక్, పగిళ్ల శివప్రసాద్, సభావత్ భాష నాయక్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

విదేశాలలో నర్సింగ్, పారామెడికల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్. పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూకేలో ఉద్యోగానికి జిఎన్ఎమ్ లేదా బిఎస్సి నర్సింగ్ ఐ ఎల్ టి ఎస్ 7, అంతకంటే ఎక్కువ ఓఈటి బి గ్రేడ్ సిబిటి కలిగి కనీసం రెండు సంవత్సరాల క్లినికల్ అనుభవం కలిగి ఉండాలని, జీతం 29 నుండి 35 లక్షలు ఇస్తారని తెలిపారు. కెనడాలో ఉద్యోగానికి బిఎస్సి నర్సింగ్ ఐఎల్‌టీఎస్ 5 అంతకంటే ఎక్కువ ఇన్ కేక్స్ కలిగి ఉండి కనీసం రెండు సంవత్సరాల క్లినికల్ అనుభవం కలిగి ఉండాలని, జీతం 36 నుండి 49 లక్షలు ఇస్తారని తెలిపారు. పైన పేర్కొన్న అర్హతలు, ఆసక్తి గల నర్సులు బయోడేటాని tomcom. recruitmentmanager@gmail.com కు ఈనెల 25వ తేదీలోపు పంపాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7893566493ను సంప్రదించాలన్నారు.

టీడీపీ నూతన కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

టీడీపీ రాష్ట్ర ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్‌వీ. యాదవ్ శుక్రవారం నల్లగొండ పట్టణ కమిటీని, అదేవిధంగా నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలల కమిటీని నియమించారు. నల్లగొండ పట్టణ అధ్యక్షులుగా గుండు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గోగు నాగరాజు, కనగల్లు మండల అధ్యక్షులుగా దోటి సైదులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం గోపాల్, నల్లగొండ మండలం అధ్యక్షులుగా పాలడుగు నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా గుత్త శంకర్ రెడ్డి, తిప్పర్తి మండల అధ్యక్షులుగా దొంతినేని నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా కొండ జాఫర్ గౌడ్‌లను నియమించారు.



శ్రీనివాస్‌నగర్‌ను సందర్శించిన జార్ఖండ్ ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

మండలంలోని శ్రీనివాస్ నగర్ గ్రామాన్ని ఝార్ఖండ్ రాష్ట్ర జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్‌తో సహా 24 మంది ప్రజాప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, లైబ్రరీ, జిమ్, గ్రామపంచాయతీ కార్యాలయం, మోడల్ స్కూల్, రైతు వేదిక, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్ల కనెక్షన్, నర్సరీవంటి పనులను పరిశీలించారు. గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని సర్పంచ్ బొగవెల్లి వెంకటరమణ చౌదరిని వారు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపిపి నూకల సరళ, ఎంపిటిసి సుజాత ,సర్పంచ్ వెంకటరమణ చౌదరి, జెడ్పి సియిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఎంపిడిఓ జ్యోతిలక్ష్మి కార్యదర్శి అనిత, ఉపసర్పంచ్ అచ్యుత్, ఎంపిఓ వీరారెడ్డి పాల్గొన్నారు.



'దత్తత అంటే ఇదేనా కేటీఆర్'

నవతెలంగాణ-మునుగోడు

ఇటీవల మునుగోడులో జరిగిన ఉపఎన్నికలలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో మునుగోడు నియోజకవర్గంను దత్తత తీసుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చి ఎన్నికలు ముగిసిన తర్వాత ముఖం చాటేసారని బీఎస్పీ మండల నాయకులు పందుల సూరన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని సోలిపురం గ్రామానికి వెళ్లే వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపడతానని ఎన్నికలలో హామీ ఇచ్చి బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రవహిస్తున్న వాగులోని మురికి నీరు తాగి, దత్తత అంటే ఇదేనా కేటీఆర్ అనే ప్లకార్డుతో వాగులో ఉండి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రులు , ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. గ్రామంలోని ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం జరిగినా కూడా పూర్తి బాధ్యత మునుగోడు ఎమ్మెల్యే వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మంత్రి ఎమ్మెల్యే స్పందించి సోలిపురం గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ ఊరి ప్రజలతో కలెక్టరేట్, ఎమ్మెల్యే ఆఫీస్‌ను బిఎస్పీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు.



గిరిజనుల కలల సహకారం కాంగ్రెస్‌తోనే..

- యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల సైదులు

నవతెలంగాణ-మునుగోడు

గిరిజన తండాల ప్రజల ఎదుర్కొంటున్న పరిష్కారం కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల సైదులు అన్నారు. శుక్రవారం త్రిపురారం మండలంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు జైవీర్‌రెడ్డి చేపట్టిన గిరిజన చైతన్య యాత్రలో మునుగోడు నియోజకవర్గంకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు యాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మందుల సైదులు మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చట్టాలను తెచ్చి గిరిజనులకు కాంగ్రెస్ అండగా ఉంటే గత తొమ్మిది సంవత్సరాలుగా పాలిస్తున్న రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో గిరిజనుల భూములు గుంజుకునేందుకు అటవీ శాఖ అధికారులతో దాడులు చేయించి అక్రమ కేసులు పెట్టి గిరిజనులను జైల్లో పెట్టించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదాని విమర్శించారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్, బీజేపీకి గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకన్న యాదవ్, నీరుడు శేఖర్, పెండ్యాల విష్ణు అనంత నర్సింహాగౌడ్ నరేందర్‌గౌడ్, దిలీప్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జిల నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు

- గ్రామ ప్రజల హర్షం..కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..

నవతెలంగాణ-కట్టంగూర్

కట్టంగూరు మండల కేంద్రంలో ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్య ఐన పెద్దవాగు పై బ్రిడ్జిల నిర్మాణం కొరకు నాలుగు కోట్ల రూపాయల నిధులను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంజూరు చేయించినట్లు జడ్పిటిసి తరాల బలరాములు శుక్రవారం తెలిపారు. నిధుల మంజూరు పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి నుండి అంబేద్కర్ నగర్ కాలనీ కి వెళ్లే ప్రజలకు, జెడ్పిహెచ్ఎస్ నుంచి నల్లగొండ రోడ్డుకు వెళ్లే ప్రజలకు ఈ బ్రిడ్జిల నిర్మాణం ఎంతగానో ఉపయోగమవుతుందని తెలిపారు. రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రెండు కోట్లు చొప్పున నాలుగు కోట్ల నిధులను మంజూరు అయ్యాయని దీంతో అంబేద్కర్ నగర్, అంబటి వాగు, రాంనగర్ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తీరుతాయని అన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఊటుకూరి ఏడుకొండలు, నకిరేకల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ్మ,మేకల రమేష్, నిమ్మల సత్యనారాయణ, అంతటి శ్రీను, రెడ్డిపల్లి మనోహర్ పెద్ది బాలనర్సింహ్మ కానుగు లింగయ్య, బోల్లెద్దు యాదయ్య వెంకన్న, జనార్ధన్ ఉన్నారు.